VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
సోమవారం 25.05.2026
సంపుటి: 07 సంచిక: 350
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper



## భారత్‌అమెరికా మైత్రికి అడుగులు

- కీలక చర్చల వివరాలు వెల్లడించిన జైశంకర్, రూబియో
- వాణిజ్య ఒప్పందంపై ముమ్మర చర్చలు
- త్వరలోనే భారత్‌కు అమెరికా ఉన్నత స్థాయి ప్రతినిధులు
- భారతీయుల ప్రయోజనాలే ముఖ్యమన్నమంత్రి జైశంకర్
- రక్షణ రంగంలో సరికొత్త మైలురాయి
- మేక్ ఇన్ ఇండియాకు పెద్దపీట

2

## ఘనంగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

- ఘనంగా నిర్వహించిన పి. ప్రసన్న కుమార్ శర్మ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ
- రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల ఉత్సాహం
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో సంబరాలు
- చార్మినార్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలు
- పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు
- ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు
- నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై నాయకుల ప్రశంసలు

హైదరాబాద్ వెలుతురు మే 24:
రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మా మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ ప్రాంతాల్లో సంబరాలు జరిపారు. పార్టీకి చెందిన అనేక జిల్లా, మండల స్థాయి నాయకత్వం తమ తమ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద జరిగిన ప్రధాన వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్, వెంకటేష్, అల్లం భాస్కర్ తదితర సీనియర్ నాయకులు, అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనడంతో ఆ ప్రాంతం ..మిగతా 2లో




2

## రైతులకు రూ.45 వేల కోట్ల చెల్లింపులు



- ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగుతున్నాయి
- మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు..
- రాష్ట్రంలో 8,575 కొనుగోలు కేంద్రాలు
- 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి
- రైతులకు రూ.45 వేల కోట్ల చెల్లింపులు
- హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి ఉత్తమ్
- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం
- తరుగు పేరుతో మోసాలపై కఠిన చర్యలు

హైదరాబాద్ వెలుతురు మే 24:
రాష్ట్రంలో మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు సుమారు రూ.45 వేల కోట్లను ప్రభుత్వం చెల్లించిందని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వబోమని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు సమయంలో 'తరుగు' పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించరాదని స్పష్టం చేశారు.

**వర్షా లతో తడిచినా ధాన్యం కొనుగోలు తప్పనిసరి**
వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయినా కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



## ఈత, తాటి వనాల వద్ద అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

- ఈత వనాల దగ్ధంతో గౌడ కుటుంబాలకు భారీ నష్టం
- అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచన
- ఎండిన ఆకులు, చెత్త తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్న మంత్రి
- గీతా కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశం
- మంటలు కనిపిస్తే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి
- బీడీలు, సిగరెట్లు కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్న హెచ్చరిక
- ఈత, తాటి చెట్లు గీతా కార్మికుల జీవనాధారమని వ్యాఖ్య
- గ్రామ స్థాయిలో చెట్ల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు
- అధిక ఉష్ణోగ్రతలు, నిప్పు రవ్వలతో పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు

2

హైదరాబాద్ వెలుతురు మే 24:
వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, నిప్పు రవ్వల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వరుస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో గౌడ సోదరులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈత, తాటి చెట్లు గీతా కార్మికుల జీవనాధారమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటీవల జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామం, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొలనూరు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో ఈత వనాలు పూర్తిగా ..మిగతా 2లో



- రాష్ట్రవ్యాప్తంగా 8 వేల గ్రామ మహిళా భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- మహిళా సాధికారతకు కొత్త మైలురాయి
- తెలంగాణలో 8,000 గ్రామ మహిళా భవనాల నిర్మాణం
- వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఉదయం 10.30 గంటలకు ప్రారంభం
- స్వయం సహాయక సంఘాలకు బలమైన మౌలిక వేదికలు
- గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం

### మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం

# ముందడుగు

- ప్రతి జిల్లాలో ప్రత్యక్ష సమీక్ష కార్యక్రమం
- మహిళా సంఘాల ప్రతినిధులతో సీఎం ముఖాముఖి
- అభిప్రాయాలు, సూచనలు స్వీకరణ
- ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలపై అవగాహన
- మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ వెలుతురు మే 24:
తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని మరో కీలక ముందడుగు వేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు బలమైన ఆర్థిక, సామాజిక వేదికలు కల్పించేందుకు 8 వేల గ్రామ మహిళా భవనాల నిర్మాణానికి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలకు సంబంధించిన స్వయం సహాయక సంఘాల (SHGs) కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామస్థాయిలో మహిళల ఆర్థిక స్వావలంబనకు, పరిపాలనా భాగస్వామ్యానికి ఈ భవనాలు కీలక కేంద్రాలుగా మారనున్నాయి. గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మహిళా సాధికారతకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇప్పుడు కొత్తగా నిర్మించనున్న మహిళా భవనాలు గ్రామ స్థాయిలోనే అన్ని రకాల కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి. సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక చర్చలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలకు ఈ భవనాలు వేదికగా నిలవనున్నాయి.ప్రతి గ్రామంలో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగడానికి ఈ భవనాలు దోహదం చేయనున్నాయి. బ్యాంకింగ్ లావాదేవీలు, సూక్ష్మ రుణాలు, చిన్న పరిశ్రమల నిర్వహణ వంటి కార్యకలాపాలు మరింత సులభతరం కానున్నాయి.

**వర్చువల్ శంకుస్థాపనతో ప్రారంభం**
సీఎం రేవంత్ రెడ్డి ఈ 8 వేల భవనాల నిర్మాణానికి వర్చువల్ విధానంలో ..మిగతా 2లో



2

## కొనుగోళ్లపై కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లు చేపట్టాలని సీఎం నిర్ణయం : మంత్రి తుమ్మల

- కే- మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన 4000 కోట్లకు అదనంగా మరో రూ.1800 కోట్లకు ఆమోదం తెలిపిన సీఎం : మంత్రి తుమ్మల
- మొక్కజొన్న భారీ దిగుబడుల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్న సీఎం - మంత్రి తుమ్మల

## మళ్లీ పెరగనున్న ఇంధన ధరలు

2

- పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం
- ముడిచమురు సరఫరాకు తీవ్ర విఘాతం.
- వరుస పెంపుతో సామాన్యుడి బేజారు



## కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ నమ్మము

2

- ఆ పార్టీ వెన్నుపోటు పొడిచింది
- డీఎంకే–కాంగ్రెస్ సంబంధాలపై ఉదయనిధి స్టాలిన్ తీవ్ర విమర్శలు
- అధికారం కోసం కాంగ్రెస్ వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడిందని ఆరోపణ
- టీవీకేతో చేతులు కలపడం వెనుక రాజకీయ లాభాలే కారణమని వ్యాఖ్య
- బీజేపీ ఎదుగుదలపై కాంగ్రెస్ వైఫల్యమే ప్రధాన కారణమని అభిప్రాయం
- డీఎంకే సహకారంతోనే కాంగ్రెస్ రాజకీయంగా నిలబడిందని వ్యాఖ్య

## నీట్‌యూజీ పేపర్ లీక్ దుమారం



- ప్రధాని మోదీ మౌనంపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్
- కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం
- రోడ్డున పడ్డ 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు
- ధర్మేంద్ర ప్రధాన్ తక్షణ రాజీనామాకు డిమాండ్
- హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ భారీ నిరసన
- నీట్ అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థుల పాదయాత్ర
- విద్యా వ్యవస్థను మోదీ మాఫియా శాసిస్తుందన్న రాహుల్

2




## ఎబోలా కలకలం

- భారత ప్రభుత్వం అప్రమత్తం
- ఆఫ్రికా దేశాలకు వెళ్లేవారికి హెచ్చరికలు
- ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ఎబోలా

2




## సీఎం రేవంత్ రెడ్డితో పి విశ్వనాథన్ భేటీ

- తమిళనాడు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన విశ్వనాథన్
- సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## ఈత, తాటి వనాల వద్ద అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

దగ్ధమై గౌడ కుటుంబాలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు.అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఈత, తాటి చెట్ల కింద ఎండిపోయిన ఆకులు, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. గ్రామ స్థాయిలో గీతా కార్మికులు కలిసి చెట్ల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, చెట్లకు నీరు పట్టడం, ఎండు చెత్త తొలగించడం వంటి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అలాగే ఈత, తాటి వనాల సమీపంలో బీడీలు, సిగరెట్లు కాల్చకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎవరూ నిర్లక్ష్యంగా నిప్పు వేయకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గీతా కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించినట్లు మంత్రి తెలిపారు. ఈత, తాటి వనాలను కాపాడుకోవడం ద్వారా గౌడ కుటుంబాల జీవనోపాధిని రక్షించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో పి విశ్వనాథన్ భేటీ

హైదరాబాద్ వెలుతురు మే 24:

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తమిళనాడు రాష్ట్ర మంత్రి పి. విశ్వనాథన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తమిళనాడు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, పి. విశ్వనాథన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కొత్తగా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన విశ్వనాథన్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురి మధ్య జరిగిన ఈ సమావేశం పూర్తిగా మర్యాదపూర్వక భేటీగా జరిగింది. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, అభివృద్ధి అంశాలపై సానుకూల చర్చ జరిగినట్లు సమాచారం. కార్యక్రమంలో తెలంగాణ-తమిళనాడు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై కూడా అనౌపచారికంగా అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు తెలుస్తోంది.

## మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు ఈ కార్యక్రమానికి అనుసంధానమై పాల్గొననున్నాయి. ప్రతి జిల్లాలో కలెక్టరేట్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులతో సీఎం ప్రత్యక్షంగా మాట్లాడనున్నారు. గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ పథకాల అమలుపై అభిప్రాయాలు సేకరించనున్నారు.

**కలెక్టరేట్‌లలో ప్రత్యేక సమావేశాలు**

ప్రతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో మహిళల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక పరిస్థితి, ఉపాధి అవకాశాలు, విద్యా అవసరాలు వంటి అంశాలపై చర్చించనున్నారు.మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలను కూడా సీఎం వివరించనున్నారు.

**స్వయం సహాయక సంఘాలకు కొత్త ఊతం**

తెలంగాణలో స్వయం సహాయక సంఘాలు ఇప్పటికే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇప్పుడు ఈ మహిళా భవనాల ద్వారా వాటికి మరింత బలమైన మౌలిక సదుపాయాలు లభించనున్నాయి.సమావేశ గదులు, శిక్షణ కేంద్రాలు, బ్యాంకింగ్ సౌకర్యాలు వంటి వసతులు అందుబాటులోకి రానుండటంతో మహిళల కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయి. గ్రామ స్థాయిలోనే నిర్ణయాలు తీసుకునే అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

ఈ మహిళా భవనాల నిర్మాణం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపనుంది. చిన్న తరహా పరిశ్రమలు, హస్తకళలు, కుట్టు పరిశ్రమలు వంటి రంగాల్లో మహిళలు మరింత చురుకుగా పాల్గొననున్నారు.ఆర్థిక స్వావలంబన పెరగడంతో గ్రామాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వ సంక్షేమ దృక్పథం**

మహిళల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా కొనసాగుతోంది. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలులో ఉండగా, ఈ మహిళా భవనాలు వాటి అమలును మరింత సమర్థవంతం చేయనున్నాయి.

## మళ్లీ పెరగనున్న ఇంధన ధరలు

పశ్చిమాసియా వెలుతురు మే 24:

దేశంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఇంధన ధరల భారం మరింత పడే అవకాశం కనిపిస్తోంది. రానున్న రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరగడం ఖాయమని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ రాజ్‌కుమార్ దూబే స్పష్టం చేశారు. ఒక ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన దేశంలోని ప్రస్తుత చమురు మార్కెట్ పరిస్థితులపై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఇంధన సంక్షోభం, ముఖ్యంగా పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం దీనికి ప్రధాన కారణాలని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు నిరంతరం పెరుగుతుండటం వల్ల భారతదేశానికి భవిష్యత్తులో ఇంధన సెగ తప్పదని ఆయన విశ్లేషించారు. మొదట్లో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు 20 నుంచి 50 శాతం వరకు పెరిగినప్పుడు, దీనిని తాత్కాలిక సమస్యగానే అందరూ భావించారని దూబే గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, యుద్ధాలు చూస్తుంటే ఈ ఇంధన సంక్షోభం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భారీ ధరల పెంపును తట్టుకుని, మార్కెట్‌ను సమతుల్యం చేయడానికి ప్రధానంగా మూడు మార్గాలు ఉన్నాయని ఆయన ప్రభుత్వానికి సూచించారు. మొదటిది పెట్రోల్ బంకుల్లో నేరుగా ధరలను పెంచి ఆ భారాన్ని ప్రజలపై వేయడం, రెండోది ప్రభుత్వ రంగ చమురు కంపెనీలే ఆ నష్టాలను భరించడం, ఇక మూడోది ప్రభుత్వం తన బడ్జెట్ లోటును లెక్కచేయకుండా సొంత నిధులను సబ్సిడీ రూపంలో సమకూర్చడం. ఈ మూడింటిలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వానికి అనివార్యంగా మారింది. ఇదిలా ఉంటే, దేశంలో గత కొన్ని రోజులుగా చమురు ధరలు వరుసగా పెరుగుతూనే ఉన్నాయి. చమురు సంస్థలు శనివారం కూడా ధరలను సవరించాయి. తాజా పెంపులో భాగంగా పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచడం గమనార్హం. కేవలం వాహన ఇంధనాలే కాకుండా పర్యావరణహిత ఇంధనంగా భావించే సీఎన్‌జీ ధరను కూడా కిలోకు ఒక రూపాయి మేర పెంచారు. ఈ తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 87 పైసలు పెరిగి, గతంలో ఉన్న రూ.91.58 నుండి ఏకంగా ₹92.49 కి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడంతో పాటు, డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బలహీనపడటం, చమురును శుద్ధి చేసే రిఫైనింగ్ ఖర్చులు ఎక్కువవ్వడం వల్లే మన దేశానికి దిగుమతి వ్యయం భారీగా పెరిగిందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. నిజానికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు మే 15వ తేదీ వరకు ఎలాంటి ధరల పెంపు లేకుండా పాత ధరలనే కొనసాగించాయి. కానీ, అంతర్జాతీయ ఒత్తిడి తట్టుకోలేక మే 15 నుంచి వరుసగా బాదుడు ప్రారంభించాయి. మే 15న పెట్రోల్, డీజిల్ ధరలను ఒక్కసారిగా లీటర్‌కు రూ.3 చొప్పున పెంచిన సంస్థలు, ఆ తర్వాత మే 19న మరో 90 పైసలు పెంచాయి. ఇప్పుడు మళ్లీ ధరలు పెంచడంతో సామాన్య వాహనదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఈ ధరల పెంపు కేవలం వాహనదారులకే కాకుండా రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

# నీట్-యూజీ పేపర్ లీక్ దుమారం

న్యూఢిల్లీ వెలుతురు మే 24:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ 2026 ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ భారీ కుంభకోణంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న మౌనాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉదాసీనత వల్లే దేశంలో వరుసగా పరీక్ష పత్రాలు లీక్ అవుతున్నాయని ఆయన ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టిన ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనకు సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారి, యువత అంతా రోడ్లపైకి వచ్చి న్యాయం చేయాలని పోరాడుతున్నా ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి బాధ్యతాయుతంగా సమాధానం చెప్పడం కంటే, సమస్యల నుంచి తప్పించుకోవడమే ఎక్కువైపోయిందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసి, దేశంలో పేపర్ లీకులను అరికట్టేందుకు ఒక బలమైన, పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేసేంతవరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించబోదని ఆయన స్పష్టం చేశారు. ఇదే విషయమై కాంగ్రెస్ పార్టీ కూడా సామాజిక మాధ్యమాల ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసింది. రాహుల్ గాంధీ షేర్ చేసిన నిరసన వీడియోను రీషేర్ చేస్తూ, ప్రస్తుతం దేశంలో పేపర్ లీక్ మాఫియా విచ్చలవిడిగా వర్ధిల్లుతోందని ఆరోపించింది. ఇంత పెద్ద ప్రమాదం జరుగుతున్నా అధికారంలో ఉండి చర్యలు తీసుకోవాల్సిన వారు కళ్లు మూసుకుని వేడుక చూస్తున్నారని విమర్శించింది. విద్యార్థుల జీవితాలతో, వారి కష్టార్జితంతో ఆడుకునే ఇలాంటి చలగాటాలను తాము ఎంతమాత్రం సహించబోమని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. తక్షణమే దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ నేతృత్వంలో వందలాది మంది విద్యార్థులు, యువకులు పాల్గొని పాదయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ, నీట్ యూజీ పేపర్ లీక్ అనేది కేవలం ఒక పరీక్ష పత్రం బయటకు రావడం కాదని, దేశంలోని 22 లక్షల మంది విద్యార్థుల రాత్రింబవళ్ల కష్టాన్ని, వారి తల్లిదండ్రుల కలలను నిలువునా ముంచేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, ఆయన వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. అసలు వివాదం విషయానికి వస్తే, మే 3వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ అయిందంటూ ప్రారంభంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో, పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అంతర్గతంగా విచారణ చేపట్టింది. ఈ విచారణలో పరీక్ష పత్రాలు లీక్ అయినట్లు స్పష్టమైన ఆధారాలు లభించడంతో, దిద్దుబాటు చర్యల్లో భాగంగా మే 12న ఆ పరీక్షను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం పరీక్షకు ముందే గెస్ పేపర్లు మార్కెట్లోకి వచ్చాయని ఒప్పుకోక తప్పలేదు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కు అప్పగించింది. మరోవైపు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్‌టీఏ వైఖరిని సమర్థిస్తూనే, విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నష్టపోయిన అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చెప్పారు. ఇందులో భాగంగానే జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా 'రీనీట్' (మళ్లీ నీట్ పరీక్ష) నిర్వహిస్తామని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈసారి ఎలాంటి అక్రమాలకు, పొరపాట్లకు తావులేకుండా వంద శాతం పారదర్శకంగా, కఠిన నిబంధనల మధ్య పరీక్షను పూర్తి చేస్తామని వెల్లడించారు. మరోసారి ఇటువంటి లీకేజీలు పునరావృతం కాకుండా ఉండేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈసారి 'జీరో ట్రస్ట్' (ఎవరినీ ముందస్తుగా నమ్మకూడదనే) కఠిన విధానాన్ని అవలంబిస్తోందని అధికారులు తెలిపారు. ప్రతి స్థాయిలోనూ భద్రతను అత్యంత కఠినతరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, వరుస వైఫల్యాల వల్ల ఎన్‌టీఏ సంస్థపై విద్యార్థులకు, ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయిందని, అందువల్ల ఈ ప్రతిష్టాత్మక నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను దేశంలోనే అత్యున్నత వైద్య సంస్థ అయిన ఎయిమ్స్ ఢిల్లీకి అప్పగించాలనే డిమాండ్లు విద్యార్థి సంఘాలు, విద్యావేత్తల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

## భారత్-అమెరికా మైత్రికి అడుగులు

ఢిల్లీ వెలుతురు మే 24:

భారతదేశం, అమెరికా దేశాల మధ్య ఉన్న దౌత్య, వాణిజ్య బంధాలు మరింత బలపడుతున్నాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే ఒక సమగ్రమైన వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో కలిసి ఆయన ఢిల్లీలో ఒక సంయుక్త మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. అమెరికాతో వాణిజ్య పరమైన చర్చలు చాలా సానుకూల వాతావరణంలో జరుగుతున్నాయని, దీనికి సంబంధించిన తుది ముసాయిదాను సిద్ధం చేసేందుకు అమెరికా ఉన్నత స్థాయి బృందం త్వరలోనే భారతదేశంలో పర్యటించబోతోందని వెల్లడించారు. అయితే, ఏ ఒప్పందం కుదిరినా అందులో మన దేశ ప్రయోజనాలే పరమావధి అని ఆయన తేల్చి చెప్పారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా అమెరికా ప్రతిపాదించిన కొన్ని అంశాలపై భారతదేశానికి కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని జైశంకర్ చాలా స్పష్టంగా చెప్పారు. "మాకు అన్నిటికంటే 140 కోట్ల మంది భారతీయ ప్రజల ప్రయోజనాలే అత్యంత ముఖ్యం. వారి నష్టానికి దారితీసే ఏ నిర్ణయాలనూ మేము అంగీకరించం. మన దేశ అవసరాలు, ఇక్కడి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగానే ఒప్పందాలు ఉంటాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల భారత ప్రతినిధుల బృందం వాషింగ్టన్‌లో పర్యటించిందని, ఇప్పుడు దానికి కొనసాగింపుగా అమెరికా బృందం ఇక్కడికి వస్తోందని చెప్పారు. గత ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య కుదిరిన అవగాహనకు ఇది ఒక కీలకమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. రక్షణ మరియు భద్రతా రంగాలలో రెండు దేశాల సహకారం సరికొత్త స్థాయికి చేరిందని ఈ సమావేశంలో జైశంకర్ వివరించారు. భారత్అమెరికా మధ్య గత పదేళ్లుగా సాగుతున్న 'ప్రధాన రక్షణ భాగస్వామ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని' ఇటీవల అధికారికంగా పునరుద్ధరించినట్లు ఆయన ప్రకటించారు. దీనితో పాటు సముద్ర గర్భ రక్షణ అవగాహనకు సంబంధించిన ఒక కీలక రోడ్‌మ్యాప్‌పై కూడా ఇరు దేశాలు సంతకాలు చేశాయి.

## ఎబోలా కలకలం

ఢిల్లీ వెలుతురు మే 24:

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాలలో ఎబోలా వైరస్ మహమ్మారి చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. దేశంలోకి ఈ వైరస్ ప్రవేశించకుండా ఉండేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలకమైన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) జారీ చేసింది. ఆఫ్రికాలో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి దేశాలకు భారత పౌరులు ఎవరూ అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని కేంద్రం గట్టిగా సూచించింది. ఒకవేళ చాలా ముఖ్యమైన పనుల నిమిత్తం ఆయా దేశాలకు వెళ్లాల్సి వస్తే, తిరిగి వచ్చేటప్పుడు విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ అధికారుల కంటే ముందే అక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్త్ డెస్క్ వద్ద తమ ఆరోగ్య సమాచారాన్ని నివేదించడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. మరోవైపు అంతర్జాతీయంగా ఈ వైరస్ వ్యాప్తి చెందుతున్న తీరుపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఎబోలా విస్తరణను ప్రపంచవ్యాప్త అత్యవసర పరిస్థితిగా (గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ) ప్రకటించింది. అదే సమయంలో ఆఫ్రికా ఖండానికి చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఆఫ్రికా సీడీసీ) కూడా కాంగో, ఉగాండా దేశాలలో ఉన్న ఎబోలా పరిస్థితులను గమనించి, దీనిని ఖండ భద్రతకు సంబంధించిన ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా గుర్తించింది.

## రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లు చేపట్టాలని సీఎం నిర్ణయం : మంత్రి తుమ్మల

హైదరాబాద్ వెలుతురు మే 24:

రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి కొనుగోళ్లపై ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు వచ్చి భారీ స్థాయిలో కొనుగోళ్లు చేపట్టడానికి సీఎం ఆమోదం తెలిపారని మంత్రి అన్నారు. యాసంగి 202526 సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ సీజన్ లో మొక్కజొన్న సాగు 16.13లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు. ఎకరాకు సగటు దిగుబడి 26.57 క్వింటాళ్లుగా నమోదవడంతో మొత్తం ఉత్పత్తి 42.87 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర అందేలా ప్రభుత్వం ఇప్పటికే రూ.4,172.94 కోట్ల గ్యారంటీ ఇవ్వగా, అదనంగా మరో 6.53 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు రూ.1867.77 కోట్ల బ్యాంకు గ్యారంటీకి కేబినెట్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 354 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటికే 12.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను 2,33,000 మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మొత్తం రూ.5063 కోట్ల మేర మాత్రమే ఖర్చు చేయగా, మా ప్రభుత్వం మాత్రం రైతుల ప్రయోజనాల కోసం ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే దాదాపు రూ.6000 కోట్ల మేర వ్యయం చేస్తోందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతు సంక్షేమంపై ఎవరికెంత చిత్తశుద్ధి ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయని అన్నారు. రైతుల వద్దకు ఇప్పుడు వెళ్లి కొందరు రాజకీయ నాటకాలు ఆడుతున్నారని, కానీ రైతు పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతు కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న మార్కెట్ ధర క్వింటాకు రూ.1700 నుండి రూ.1850 మధ్య ఉండగా, కేంద్రం స్పందించకపోయినా రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం సీఎం రైతు పక్షపాత ధోరణికి నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. భారీ దిగుబడులు, కొనుగోలు కేంద్రాలకు పెరిగిన రాకలు దృష్ట్యా జిల్లాల వారీగా అదనపు కొనుగోలు లక్ష్యాలను నిర్ణయించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జొన్న (హైబ్రిడ్) కొనుగోళ్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో జొన్న ధర క్వింటాకు సుమారు రూ.2000 మాత్రమే ఉండగా, కేంద్రం నిర్ణయించిన MSP రూ. 3699గా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.1100 కోట్లకు పైగా వ్యయంతో జొన్న కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## ఘనంగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో మార్మోగింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కూడా ఇదే తరహాలో జన్మదిన వేడుకలు నిర్వహించబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండాలను ఎగురవేసి, కేక్ కటింగ్ కార్యక్రమాలు చేపట్టి, నాయకుడికి శుభాకాంక్షలు తెలిపారు. అనేక చోట్ల యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, మహేశ్‌కుమార్ గౌడ్ నలభై ఏళ్లకు పైగా రాజకీయ ప్రస్థానంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొని, పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని నేతలు గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో బలాన్ని తీసుకురావడంలో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు నేతలు ప్రశంసించారు. రాజకీయ ప్రయాణంలో ఆయన చూపిన పట్టుదల, క్రమశిక్షణ, పార్టీ పట్ల నిబద్ధతను కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు.వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయడం, ఆసుపత్రుల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడం, అనాథాశ్రమాల్లో అన్నదానం నిర్వహించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు.




జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం పార్టీ శ్రేణులలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ మహేశ్‌కుమార్ గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలను చేపట్టాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వం మరింత దోహదం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో పార్టీ కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ వంటి జిల్లాల్లో కూడా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి ప్రాంతంలోనూ స్థానిక నాయకులు కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి, పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. అనేక చోట్ల రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించడం గమనార్హం.పార్టీ కార్యకర్తలు మాట్లాడుతూ మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వం పార్టీకి కొత్త దిశానిర్దేశం ఇస్తుందని అభిప్రాయపడ్డారు. ఆయన సామాన్య కార్యకర్తల నుంచి పై స్థాయికి ఎదిగిన విధానం అందరికీ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలోనూ నిలబడిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని గుర్తు చేశారు.మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరిపిన ఈ జన్మదిన వేడుకలు, నాయకుడిపై ఉన్న అభిమానాన్ని, పార్టీ ఐక్యతను ప్రతిబింబించాయి. సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయ ఉత్సాహం కలగలిపిన ఈ వేడుకలు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ నమ్మము

చెన్నై వెలుతురు మే 24:

తమిళనాడు రాజకీయాల్లో మిత్రపక్షాల మధ్య సంబంధాలు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. డీఎంకే యువనేత, ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమను రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకుని తర్వాత వెన్నుపోటు పొడిచిందని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ డీఎంకే రాజకీయ బలంపై ఆధారపడి ఎదిగిందని ఉదయనిధి వ్యాఖ్యానించారు. అయినప్పటికీ అధికారం కోసం ఆ పార్టీ ఇతర రాజకీయ శక్తులతో, ముఖ్యంగా టీవీకే (తమిళగ వెట్రి కజగం)తో చేతులు కలపడం ద్వారా తమను దూరం పెట్టే ప్రయత్నం చేసిందని ఆయన విమర్శించారు. ఇది రాజకీయ నమ్మకద్రోహానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తీరు ఇకపై డీఎంకే కార్యకర్తలు మర్చిపోవద్దని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఆ పార్టీ నేతలకు డీఎంకే వేదికల్లో లేదా రాజకీయ పరిధిలో ప్రాధాన్యం ఇవ్వకూడదనే స్థాయిలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ మాత్రమే కాకుండా వ్యూహాత్మక హెచ్చరికగా కూడా భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ వరుస విజయాలకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వమే కారణమని తాను ఇన్నాళ్లు భావించానని, కానీ వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అసమర్థతే ప్రధాన కారణమని ఇప్పుడు స్పష్టమవుతోందని ఉదయనిధి వ్యాఖ్యానించారు. బీజేపీ ఎదుగుదల వెనుక ప్రతిపక్షాల వైఫల్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. డీఎంకేతో పొత్తు వల్లే కాంగ్రెస్ పార్టీకి గతంలో రాజ్యసభ సీట్లు, అసెంబ్లీ ప్రాతినిధ్యం లభించిందని ఆయన గుర్తుచేశారు.

# నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు

- **తెలంగాణ మహిళా సాధికారతకు కొత్త దిశ**
- **కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ఆదాయ వనరులు కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం**
- **మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వెత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం- మంత్రి సీతక్క**

హైదరాబాద్, వెలుతురు మే 24:

తెలంగాణలో మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం కొత్త అర్థం చెబుతోంది. ఒకప్పుడు కేవలం పొదుపు సంఘాలుగా ఉన్న మహిళా స్వయం సహాయక బృందాలు... ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామ్య శక్తులుగా ఎదుగుతున్నాయి. ఆడబిడ్డలను సంక్షేమ లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ఈ నేపథ్యంలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం, పోషణ, పారిశ్రామిక ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మహిళా వారోత్సవాల సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలు, సెర్ప్, మెప్మాల ఆద్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు, యువతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సాధికారత కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వెత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



మహిళా వారోత్సవాల్లో భాగంగా ప్రారంభం కానున్న ఖమ్మం జిల్లాలోని మహిళా సోలార్ విద్యుత్ ప్లాంటు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క మార్గదర్శకత్వంలో మహిళా సంఘాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది.

మహిళా సంఘాలకు ఈ ఐదేళ్లలో బ్యాంక్ లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయల రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల రుణాలు అందించారు. వీటి ద్వారా వేల లక్షల సంఖ్యలో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1397 కోట్ల వడ్డీ రాయితీ మహిళా సంఘాలకు ప్రభుత్వం చెల్లించగా మహిళా వారోత్సవాల్లో మరో రూ.650 కోట్లను చెల్లించనున్నారు.

'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమం ద్వారా మహిళలను స్వయం ఉపాధి రంగంలో బలోపేతం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 222 మహిళా సంఘాల క్యాంటీన్లు ఏర్పాటు కాగా... ఒక్కో యూనిట్ నెలకు సగటున రూ.72 వేల వరకు లాభాలు ఆర్జిస్తోంది. మహిళల నిర్వహణలో పెట్రోల్ బంకులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెండు యూనిట్లు ప్రారంభం కాగా... మరో 30 పెట్రోల్ బంకుల నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి.

మహిళా సమాఖ్యలు రూ.199 కోట్ల పెట్టుబడితో 553 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన టీజీఎస్ఆర్టీసీకి అందించాయి. ఒక్కో బస్సు ద్వారా నెలకు సుమారు రూ.70 వేల వరకు ఆదాయం లభిస్తోంది.

అలాగే వరి కొనుగోలు కేంద్రాలు, పాల విక్రయ కేంద్రాలు, మైక్రో వ్యాపారాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థల ద్వారా మహిళలు ఆదాయం పెంచుకుంటున్నారు. గ్రామీణ మహిళలను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సెర్ప్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

రైతులు పండించిన పంటలను మధ్య దళారులు లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (FPOలు) దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమవుతున్నాయి మామిడి, మిర్చి, పసుపు, కంది వంటి పంటలను రిటైల్ చైన్‌లు, ఈకామర్స్ వేదికలు, ఎగుమతి మార్కెట్లకు సరఫరా చేసే వ్యవస్థను అభివృద్ధి చేశారు. మహిళా రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ, గ్రేడింగ్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్, రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇక్రిసాట్ సంస్థతో కలిసి ఫుడ్ ప్రాసెసింగ్ యునిట్లలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

వేయి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాలకు కేటాయించగా... మహిళా వారోత్సవాల సందర్భంగా 6 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ప్రారంభించనున్నారు. అలాగే రూ.110 కోట్ల వ్యయంతో 22 జిల్లాల్లో నిర్మిస్తున్న "ఇందిరా మహిళా శక్తి భవనాలు" మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలవనున్నాయి.

- **మహిళా వారోత్సవాల ముఖ్య కార్యక్రమాలు**

**మే 25 – ఇందిరా మహిళా శక్తి భవనాల శంకుస్థాపనలు**

గ్రామ, మండల స్థాయిలో మహిళా సంఘాలకు మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో కొత్త IMS భవనాలకు శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో 8 వేల IMS భవనాలకు ఒకేసారి శంకుస్థాపనలు జరగనున్నాయి. మహిళా సంఘాల కోసం ప్రత్యేక చీరలను కూడా రాష్ట్ర స్థాయిలో ఆవిష్కరించనున్నారు. గ్రామ, మండల స్థాయిలో VO/MS భవనాలు, న్యూట్రిషన్ హెల్త్ సెంటర్లు, వర్క్ షెడ్లు, గోదాముల నిర్మాణాలకు భూమిపూజలు చేపట్టనున్నారు.

**మే 26 – 553 ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం**

మహిళా సమాఖ్యలకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో కొనుగోలు చేసిన 553 RTC బస్సులను రాష్ట్ర స్థాయిలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. మండల సమాఖ్యల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన బస్సులు జిల్లాల వారీగా టీజీఎస్ఆర్టీసీకి అనుసంధానమవనున్నాయి.

**మే 27 – సోలార్ ప్లాంట్ల ప్రారంభం, ప్రత్యేక సాధారణ సమావేశాలు**

వికారాబాద్, మధిర ప్రాంతాల్లో మహిళా సమాఖ్యలకు మంజూరైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రారంభించనున్నారు. మండల సమాఖ్యలు, ఏరియా లెవల్ ఫెడరేషన్లలో ప్రత్యేక సాధారణ సమావేశాలు నిర్వహించి 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమాల పురోగతిని సమీక్షించనున్నారు. నాయకత్వ మార్పిడి, నిధుల విడుదల, ఉత్తమ మండల సమాఖ్యలకు సన్మానాలు, 202627 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేపట్టనున్నారు.

**మే 29 – ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్, లోన్ మేళాలు, జీవనోపాధి యూనిట్లు**

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక వనరులు, ఉపాధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో లోన్ మేళాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, వ్యవసాయేతర రంగాల్లో కొత్త జీవనోపాధి యూనిట్లను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ భవన్‌లో ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు.

బ్యాక్‌యార్డ్ కోళ్ల యూనిట్లు, కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ ఫండ్, అగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు, షేడ్ నెట్లు, గోదాముల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నరాఉ. మహిళా దివ్యాంగులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే మహిళా సంఘాల వెలుపల ఉన్న మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బాలికలను గుర్తించి కొత్త SHGలుగా ఏర్పాటు చేయనున్నారు.

**మే 30 – ఉల్లాస్ కార్యక్రమం, బాలికల మాక్ పార్లమెంట్**

'అమ్మకు అక్షరమాల' ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను జిల్లా, మండల స్థాయిలో సన్మానించనున్నారు. అదే రోజు స్నేహ బాలికల కోసం జిల్లా కేంద్రాల్లో మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు నిర్వహించి నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించనున్నారు.

# కెసిఆర్ మోసం చేశాడు.. మేం న్యాయం చేస్తాం..

- **పాలమూరు ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేస్తాం..**
- **ఎమ్మెల్యే శంకర్ కృషితోనే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు నిధులు..**
- **భూసేకరణ వెంటనే మొదలవుతుంది..**
- **గత ప్రభుత్వం పూర్తిగా ద్రోహం చేసింది..**
- **రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ వాకిటి శ్రీహరి..**
- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం**



పాలమూరు వెలుతురు మే 24:

పాలమూరు ప్రాజెక్టు పేరు చెప్పి రెండుసార్లు ఘనవిజయం సాధించి తరువాత మాట తప్పి కెసిఆర్ పాలమూరు ప్రజలకు ద్రోహం చేశాడు.. కానీ పాలమూరు బిడ్డగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరుకు న్యాయం చేస్తాడు.. పాలమూరు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తాం.. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కలను సాకారం చేస్తాం.. అని రాష్ట్ర క్రీడలు, పాడి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను పూర్తి చేయకపోతే ఏ నాయకుడైనా జీవితంలో ఏదో ఒకటి కోల్పోయినట్లే అని స్పష్టం చేశారు. కెసిఆర్ కు అడ్రస్ లేకపోయినా పాలమూరు జిల్లాలో ప్రాజెక్టు పూర్తి చేస్తాడని నమ్మి గెలిపించారని, కానీ కేవలం తమ అవినీతి కోసం ఈ ప్రాజెక్టును వాడుతున్నారని ఆరోపించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 21 స్టేజీలు నీళ్లు దిగుమతి చేసుకుంటామంటూ కేవలం 18 స్టేజీలకు పరిమితం చేశారని, 58 వేల కోట్లు మంజూరు అయితే కేవలం 28 వేల కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారని విమర్శించారు. ప్రజా సంక్షేమం విషయంలో ఎవరు తప్పు చేసినా ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంటుందని, చివరికి తాము తప్పు చేసిన ప్రశ్నించాలని గుర్తు చేశారు. పాలమూరు ప్రాజెక్టు విషయంలో శంకర్ తో కలిసి సీఎంను కలవడం, మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డిని కలవడం, అనుకున్నది సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. బోర్లు వేసిన చుక్క నీరు రాని స్థితిలో ఉన్న పాలమూరుకు ప్రాజెక్టు అవసరం ఎంతగానో ఉందని అన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలలో కలెక్టరేట్లలో సమావేశాల అనంతరం చర్చించి ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేస్తామని స్పష్టం చేశారు. భూసేకరణ నిర్వహించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేస్తామని అన్నారు. ఈ విషయంలో వీర్లపల్లి శంకర్ పట్టుదలతో ఉన్నాడని, సీఎం కూడా దీనిని వదిలిపెట్టడని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతి లేకుండా, భూసేకరణ లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారని గత ప్రభుత్వం పై విరుచుకు పడ్డారు. కాళేశ్వరం కోట్లు ఖర్చుపెట్టిన గత ప్రభుత్వం పాలమూరును ఎందుకు విస్మరించిందో యువత ప్రశ్నించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.

**జనగణనతో కొత్త వెలుగు..**

జనగణన, కులగణన కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే పింకు మీడియా తమపై దుష్ప్రచారాలు చేస్తుందని, ఇలాంటివి నమ్మవద్దని శిక్షించారు. గతంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగిందని, ఈవిడత ప్రతి నియోజకవర్గానికి మరో రెండు వేల ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందమోహన్, చెంది తిరుపతి రెడ్డి, పి.రఘు, కృష్ణారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు..

# తమిళనాడు మంత్రి విశ్వనాథన్ పెరుమాళ్ గారిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీ ప్రసన్న కుమార్ శర్మ

హైదరాబాద్ వెలుతురు మే 24:

రాహుల్ గాంధీ ఆశయాలతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే విజయం సాధ్యమవుతుందనే విషయాన్ని తమిళనాడులో జరిగిన తాజా ఎన్నికలు మరోసారి నిరూపించాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీ ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.

రాష్ట్ర ఏసీసీ కార్యదర్శి, ఇంచార్జ్ కార్యదర్శి గౌరవ శ్రీ విశ్వనాథన్ పెరుమాళ్ గారు తమిళనాడులో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి, తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించడం జరిగిందని తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీ విశ్వనాథన్ పెర్మాళ్లు గారు మాట్లాడుతూ, దాదాపు అరవై సంవత్సరాల తర్వాత తన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ విజయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అంకితభావం, నాయకుల కృషి, ప్రజల విశ్వాసం వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తన విజయానికి ఎంతో కృషి చేశారని, వారందరికీ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు, తమిళనాడు రాజకీయాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో కొప్పుల ప్రవీణ్, రాష్ట్ర ఇంచార్జ్ సెక్రటరీ శ్రీ సచిన్ సవాంట్ గారు,రజక సంఘం చైర్మన్ అజయ్, టూరిజం చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి గారు, అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రసన్న కుమార్ శర్మ మాట్లాడుతూ, దాదాపు నలభై ఐదు



సంవత్సరాల ప్రజా జీవిత అనుభవం కలిగిన శ్రీ విశ్వనాథన్ గారు ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడని అన్నారు. అరవై సంవత్సరాలుగా గెలవని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని తెలిపారు. ముఖ్యంగా జనరల్ నియోజకవర్గం నుంచి షెడ్యూల్డ్ కాస్ట్ వర్గానికి చెందిన నాయకుడిగా విజయం సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

అలాగే పరిపాలనపై ఆయనకు పూర్తి అవగాహన ఉందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారని తెలిపారు. తమిళనాడులో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని శ్రీ విశ్వనాథన్ గారు పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు ఆయన రాక సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో ఘన సత్కారం నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు

# తమిళనాడు మంత్రి పి. విశ్వనాథన్‌కు మంత్రి పొంగులేటి ఘన సన్మానం


హైదరాబాద్ వెలుతురు మే 24:

తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్ ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి మంత్రి పొంగులేటిని సత్కరించారు.

అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా వేలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించి తమిళనాడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న పి. విశ్వనాథన్‌ను శాలువా, పూల మొక్కతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... తమిళనాడులో దాదాపు 59 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తరపున మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత ప్రజాసేవ చేయాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశ్వనాథన్ కృషి చేయాలని ఆకాంక్షించారు.






# నువ్వు బలహీనుడివి కాదు... అలసిపోయావంతే!

జీవిత ప్రయాణంలో ఒక్కోసారి మనకు అనిపిస్తుంది నేను చాలా బలహీనంగా ఉన్నాను. నాకు మరింత ముందుకు వెళ్ళే శక్తి లేదు. ఆ క్షణంలో మనసు అలసిపోయి, కళ్ళు చెమర్చి, గుండె భారంగా అనిపిస్తుంది. కానీ ఆగండి ఒక్క నిమిషం ఆగి, మీ హృదయానికి ఇలా చెప్పండి. "నువ్వు బలహీనుడివి కాదు... అలసిపోయావంతే!"ఈ రెండు మాటల మధ్య తేడా చాలా లోతైనది. బలహీనత అంటే మూలం నుండే శక్తి లేకపోవడం. కానీ అలసట అంటే మనం ఇంత వరకు చేసిన కష్టానికి, పోరాటానికి, నిరంతర ప్రయత్నానికి శరీరం మరియు మనసు ఇస్తున్న సహజమైన సమాధానం. అలసిపోయిన వ్యక్తి కొంచెం విశ్రాంతి తీసుకుని తిరిగి లేవగలడు. అది బలహీనత కాదు అది మానవత్వం.జీవితం అనేది వందమీటర్ల పరుగు కాదు అది మారాథాన్. ఈ పరుగులో ప్రతి ఒక్కరూ ఒక్కో దశలో అలసిపోతారు. కొంతమంది మొదటి కిలోమీటర్‌లోనే ఆయాసపడతారు, మరికొందరు చివరి దశలో. కానీ పరుగు ఆపేయడం వేరు, కొంత సేపు నడవడం వేరు. పరిజ్ఞానం ఉన్న పరుగంటే ఎప్పుడు వేగంగా పరిగెత్తాలో, ఎప్పుడు నెమ్మదిగా అడుగులు వేయాలో తెలియడమే.

మన జీవితంలో ప్రతి దశలో పోరాడాల్సిన యుద్ధాలు ఉన్నాయి. చదువు, ఉద్యోగం, కుటుంబం అవసరాలు , ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సవాళ్ళు ఇవన్నీ ఒకేసారి వచ్చినప్పుడు మనసు చాలు అని అరుస్తుంది. కానీ ఆ అరుపు బలహీనతకు సంకేతం కాదు. అది మన వ్యవస్థ మనకు పంపే ఒక హెచ్చరిక సందేశం విశ్రాంతి అవసరం.భూమిలో పాతిన విత్తనానికి అంకురం వేయడానికి ముందు చీకటిలో ఎంత సమయం గడపాల్సి వస్తుందో తెలుసా? ఆ విత్తనం చీకటిలో మగ్గుతూ, తేమలో తడుస్తూ, నేల ఒత్తిడిని భరిస్తూ ఉంటుంది. బయటి నుండి చూస్తే ఏమీ జరగడం లేదని అనిపిస్తుంది. కానీ లోపల ఒక అద్భుతమైన పరివర్తన జరుగుతుంటుంది.మీరూ అదే విత్తనం. మీ కష్టాలు, మీ నొప్పులు, మీ ఒంటరితనం ఇవన్నీ మిమ్మల్ని నాశనం చేయడానికి కాదు. మీరు మరింత బలంగా, మరింత లోతుగా మొలవడానికి సన్నద్ధం చేస్తున్నాయి. చీకటిలో ఉన్న విత్తనానికి ఆకురాలే వేళను చూసే అవకాశం ఉండదు. కానీ వసంతం తప్పకుండా వస్తుంది.అలసిపోవడం అనే అనుభవాన్ని సిగ్గుగా భావించకండి. అది ఒక గౌరవప్రదమైన సంకేతం. మీరు ఏదో ఒకటి చేయాలని ప్రయత్నించారు అని అలసట చెప్తుంది. మీరు పోరాడారు అని నొప్పి చెప్తుంది. మీకు ఇంకా కలలు ఉన్నాయి అని నిరాశ చెప్తుంది. ఇవేమీ లేని వ్యక్తి ఎప్పుడూ అలసిపోడు ఎందుకంటే అతడు ఏమీ చేయడు.

ఈ ప్రపంచంలో గొప్పగా జీవించిన ప్రతి వ్యక్తీ ఒక్కసారైనా కూలబడిన క్షణం ఉంది. తెలంగాణ



మట్టి నుండి లేచిన రైతు, అర్ధరాత్రి చదివిన విద్యార్థి, పిల్లల కోసం అన్నీ భరించిన తల్లి, సమాజం కోసం మౌనంగా పనిచేసిన ఉపాధ్యాయుడు వీళ్ళందరూ ఒక్కసారైనా నాకు ఇక శక్తి లేదు అని అనుకున్నారు. కానీ మళ్ళీ లేచారు. ఎందుకంటే వారు బలహీనులు కాదు అలసిపోయి ఉన్నారంతే.శరీరానికి నిద్ర అవసరమైనట్లే, మనసుకు కూడా విరామం కావాలి. కానీ మన సమాజంలో ఆగడం అనేది బద్ధకంగా చూస్తారు. నువ్వు ఎందుకు ఆగావు? అని అడుగుతారు. అందరూ పరిగెత్తుతున్నారు నువ్వు ఆగితే వెనక్కి పడతావు అని భయపెడతారు.కానీ ఒక నిజం గుర్తుపెట్టుకోండి పరిగెత్తడం ఆపినవారు అందరూ ఓడిపోలేదు. కొందరు తమ దారిని స్పష్టంగా చూసుకోవడానికి ఆగారు. కొందరు తమ బలాన్ని తిరిగి సేకరించుకోవడానికి ఆగారు. కొందరు ఇది తమ పరుగు కాదని గ్రహించి, వేరే దారిలో పరిగెత్తడానికి ఆగారు. ఆగడం ఓటమి కాదు అది వ్యూహం. అలసిపోయిన ప్రతి వ్యక్తికీ ఒంటరిగా ఉన్నట్లు అనిపిస్తుంది. నా నొప్పి ఎవరికీ అర్థం కాదు అనిపిస్తుంది. నా పరిస్థితి నాకు తప్ప మరెవరికీ తెలియదు అని అనిపిస్తుంది. కానీ ఈ క్షణంలో, ఈ భూమ్మీద ఏదో ఒక మూలలో మీలాగే అలసిపోయి, మీలాగే కన్నీళ్ళతో, మీలాగే ఇంకెంత? అని అడుగుతున్న మరొక మనిషి ఉన్నాడు.

మీరు ఒంటరిగా లేరు. మీ నొప్పి అందరికీ ఉంది కేవలం రూపాలు వేరు. ఒకరికి ఆర్థిక ఒత్తిడి, మరొకరికి సంబంధాల నొప్పి, ఇంకొకరికి ఆరోగ్య సమస్య. కానీ అలసట అనే భావన మాత్రం మానవులందరికీ ఒకటే. ఈ భావన మిమ్మల్ని మానవులతో కలిపే వంతెన విడదీసే గోడ కాదు.మళ్ళీ లేవడానికి వేయి కారణాలు అవసరం లేదు ఒక్కటి చాలు. అది మీ పిల్లవాడి నవ్వు కావచ్చు. మీరు ఇంకా చూడని ఒక సూర్యోదయం కావచ్చు. మీరు ఇంకా చదవని ఒక పుస్తకం కావచ్చు. మీకు ఇంకా చేయాల్సిన ఒక పని కావచ్చు. ఒక కల, ఒక వ్యక్తి, ఒక స్వప్నం ఒక్కటి చాలు.మహాత్మా గాంధీ జైలు నుండి బయటకు వచ్చినప్పుడు, అంబేద్కర్ అవమానాలను భరించి చదివినప్పుడు, కలాం సాహెబ్ తిరస్కారాలను దాటి ముందుకు నడిచినప్పుడు వారందరికీ ఒక కారణం ఉంది. మీకూ ఒక కారణం ఉంది. దాన్ని వెతకండి. పట్టుకోండి. వదలకండి.శీతాకాలంలో చెట్టు ఆకులన్నీ రాల్చుకుంటుంది. నగ్నంగా, బోసిగా నిలబడుతుంది. చూసేవారికి ఈ చెట్టు చనిపోయింది అనిపిస్తుంది. కానీ లోపల వేర్లు తమ పనిచేస్తూనే ఉంటాయి. నేల లోపల నీరు పీల్చుకుంటూ, శక్తి నిల్వ చేసుకుంటూ, వసంతం కోసం వేచి ఉంటాయి.వసంతం రాగానే అదే చెట్టు తిరిగి చిగురులు వేస్తుంది. పువ్వులు పూస్తుంది. ఆకుపచ్చగా నిండుగా నిలబడుతుంది. మీరు ఇప్పుడు శీతాకాలం చెట్టులా ఉన్నారు. ఆకులు రాల్చుకున్నారు. కానీ మీ వేర్లు మీ విలువలు, మీ కుటుంబం, మీ కలలు, మీ నమ్మకం అవి ఇంకా సజీవంగా ఉన్నాయి. మీ వసంతం రావడానికి సమయం పడుతుంది, కానీ తప్పకుండా వస్తుంది. మీకు ఇప్పుడు ఎవరైనా చెప్పాల్సిన మాటలు ఇవి. మీరు చేసిన ప్రయత్నం చాలా విలువైనది.మీరు భరించిన నొప్పి మీ బలానికి నిదర్శనం.మీరు ఇంత వరకు ఆగిపోకుండా నడిచారు అది చాలా గొప్ప విషయం.మీకు ఇప్పుడు విశ్రాంతి అవసరం ఓటమి కాదు.మీరు తిరిగి లేవగలరు ఎందుకంటే మీరు ఇంత వరకు ఎన్నోసార్లు లేచారు.కాసేపు ఏడవడానికి మొహమాటపడకండి. కన్నీళ్ళు బలహీనత కాదు అవి మనసు చేసుకునే శుభ్రత. ఏడ్చిన తర్వాత కళ్ళు స్వచ్ఛంగా కనిపిస్తాయి మనసూ అంతే.ఈ రోజు రాత్రి పక్కపై వాలే ముందు, అద్దంలో మీ ముఖంలోకి చూసుకుని ఇలా చెప్పండి.నేను బలహీనుడిని కాదు. నేను అలసిపోయాను. నేను విశ్రాంతి తీసుకుంటాను. నేను తిరిగి లేస్తాను. నా కథ ఇంకా అయిపోలేదు .ఈ మాటలు మీ హృదయంలోకి దిగనీయండి. ఒక్కో అక్షరం నిజమే.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philospher,
9490754169

# ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలు

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలి
- సంబంధిత అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి





రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 24:

"ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, పోషకాహారం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై ఈ నెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలు నిర్వహణపై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, జిల్లా అధికారులు, థీమ్ నోడల్ అధికారులు, తహసిల్దార్ లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారత, అంగన్వాడీ సేవల బలోపేతం, మహిళల భద్రత, బాలికల అభివృద్ధి, వృద్ధ మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**25 మే 2026:**
గ్రామ, మండల స్థాయిలో మహిళా సంఘాల కోసం నిర్మించనున్న IMS భవనాలకు భూమి పూజలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. అదే రోజు పోషకాహార మిషన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ప్రారంభోత్సవాలు, కొత్త భవనాలకు శంకుస్థాపనలు చేపట్టాలని సూచించారు. స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో ప్రదర్శనలు, వంటల పోటీలు నిర్వహించి పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణీలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

**26 మే 2026:**
మహిళా సంఘాలకు ఆర్థిక వనరులు కల్పించే లక్ష్యంతో ఆర్టీసీ బస్సుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు "బాల్య వివాహ రహిత తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా "బాల్య వివాహం - బతుకు ఆగం" నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై ప్రత్యేక ప్రచారం, హెల్ప్‌లైన్ నంబర్లు 181, 1098 ప్రచారం, గ్రామ పంచాయతీ తీర్మానాల ప్రదర్శన చేపట్టాలని ఆదేశించారు.

**27 మే 2026:**
మహిళా సంఘాల ఆదాయ వనరుల పెంపు కోసం సోలార్ ప్లాంట్ల ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మండల సమాఖ్యలు, ఏరియా లెవల్ ఫెడరేషన్ల ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు నిర్వహించి వివిధ పథకాల పురోగతిని సమీక్షించాలని సూచించారు. అలాగే ఉద్యోగ ప్రదేశాల్లో మహిళల భద్రతకు సంబంధించిన POSH చట్టంపై అవగాహన సదస్సులు, అంతర్గత కమిటీలకు శిక్షణ కార్యక్రమాలు, SheBox పోర్టల్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు.

**29 మే 2026:**
మహిళా సంఘాలకు రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమాలు, పౌల్ట్రీ యూనిట్లు, వ్యవసాయ మరియు స్వయం ఉపాధి పథకాల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. మిగిలిన అర్హ మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బాలికలను సంఘాలలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధ మహిళా సంఘాలతో పరస్పర సమావేశాలు నిర్వహించి ఆరోగ్యం, ఆర్థిక భద్రత, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

**30 మే 2026:**
ఉల్లాస్ కార్యక్రమంలో అక్షరాస్యత సాధించిన మహిళలను సన్మానించనున్నారు. స్నేహ బాలికల కోసం మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు నిర్వహించి నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని సూచించారు. "అమ్మ మాట - అంగన్వాడీ బాట" కార్యక్రమంలో భాగంగా పిల్లల నమోదు, యూనిఫామ్‌ల పంపిణీ, విద్యారంభ ధృవపత్రాల జారీ, అంగన్వాడీ కేంద్రాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.
జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల సిబ్బంది అన్ని కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, సిడిపిఓలు, థీమ్ నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులపై ఉద్యోగుల్లో గుబులు

- స్పష్టత లేకుండానే హడావిడి ఎందుకు?
- ప్రభుత్వంపై, యూనియన్‌లపై టి యు టి ఎఫ్ తీవ్ర ప్రశ్నలు
- ఉచితం నుంచి ప్రీమియంకు.. ఉద్యోగులకు నిజంగా లాభమా?
- టి యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ రెడ్డి విమర్శలు



శంకర్ పల్లి వెలుతురు మే 24 :

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రవేశపెట్టనున్న కొత్త ఈహెచ్ఎస్ క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల వ్యవస్థపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయకుండానే ప్రభుత్వం హడావిడిగా ఈ స్కీమ్ అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని టి యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రఘునందన్ రెడ్డి విమర్శించారు. గతంలో జీవో 317 కారణంగా వేలాది మంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేసిన ఆయన.. ఇప్పుడు అదే తరహాలో ముందస్తు అధ్యయనం, పారదర్శకత లేకుండా హెల్త్ కార్డుల విధానాన్ని తీసుకురావడం ఆందోళన కలిగిస్తోందన్నారు.
ఈ స్కీమ్‌పై ప్రభుత్వం ఎప్పుడు అధ్యయనం నిర్వహించిందో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల అమలును పర్యవేక్షించే అధికార యంత్రాంగం ఎవరు? అత్యవసర సమస్యలను పరిష్కరించే గ్రీవెన్స్ సెల్ ఉందా? వంటి కీలక ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.

**ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిగాయా?**
ఈహెచ్ఎస్ విధానంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం ఎన్ని సమావేశాలు నిర్వహించిందో బయటపెట్టాలని రఘునందన్ రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను సాధారణ ఉద్యోగులకు ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు.

**"ఆప్షనల్ ఎందుకు కాదు?"**
ఉద్యోగుల నుంచి బేసిక్ శాలరీలో 1.5 శాతం ప్రీమియం కట్ చేస్తూ స్కీమ్‌ను తప్పనిసరి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. సేవలు నచ్చకపోతే స్కీమ్ నుంచి బయటకు వచ్చే అవకాశముందా? అని ప్రశ్నించారు.

**కార్పొరేట్ ఆసుపత్రులు ఒప్పుకున్నాయా?**
ఈహెచ్ఎస్ కింద సేవలు అందించే ఆసుపత్రుల జాబితాను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. యశోద, అపోలో, కిమ్స్ వంటి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులు ఈ స్కీమ్‌కు అంగీకరించాయా? ప్రభుత్వం నిర్ణయించే ప్యాకేజీ ధరలకు చికిత్స అందిస్తాయా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**"డబుల్ నష్టం జరిగే ప్రమాదం"**
గతంలో ఈహెచ్ఎస్ పనిచేయకపోయినా మెడికల్ రీయింబర్స్మెంట్ ద్వారా ఉద్యోగులకు కొంత ఉపశమనం ఉండేదని, కానీ కొత్త విధానంలో రీయింబర్స్మెంట్ కూడా లేకుండా పోతే ఉద్యోగులు ద్వంద్వ నష్టాన్ని ఎదుర్కొంటారని హెచ్చరించారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల నుంచి ప్రీమియం కట్ చేస్తూ, సరైన వైద్య సేవలు అందకపోతే అది "బూడిదలో పోసిన పన్నీరు"గా మారుతుందని వ్యాఖ్యానించారు.

**"కార్డుల కంటే ముందు స్పష్టత ముఖ్యం"**
కేవలం కార్డులు పంపిణీ చేయడం ద్వారా వ్యవస్థ విజయవంతం కాదని, ముందుగా పూర్తి స్థాయి గైడ్‌లైన్స్, ఆసుపత్రుల ఒప్పందాలు, చికిత్సల వివరాలు ప్రజలకు వెల్లడించాలని రఘునందన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్డుల కోసం తొందరపడే ముందు తమ హక్కుల కోసం ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రతిభకు పట్టం కట్టిన పద్మశాలి సంక్షేమ సంఘం



- మెరిట్ విద్యార్థులకు ఘన సన్మానం.. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపు

కాప్రా, మే 24 (వెలుతురు):

పద్మశాలి టౌన్‌షిప్‌లోని శ్రీ భావనరుషి పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంఘం ప్రతినిధులు శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి అభినందించారు. సంఘం అధ్యక్షులు వనం విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శ్రీ భావన రుషి హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు సీతాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తుందని, ఈ దశలో కష్టపడి చదివిన వారే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మేకల వేణు, కార్యవర్గ సభ్యులు నారా జనార్దన్, ఏముల దీప, పున్న నవనీత, బింగి ఉదయశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ప్రియాంక నియామకం – డెంటల్ డాక్టర్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగింత



కాప్రా, మే 24 (వెలుతురు):

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) డాక్టర్స్ సెల్‌లో యువ వైద్యురాలు డాక్టర్ ప్రియాంకకు కీలక బాధ్యతలు దక్కాయి. పార్టీ వైద్య విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆరోగ్య రంగానికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ఆమెను టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలోని డెంటల్ డాక్టర్ల విభాగానికి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను కూడా అప్పగించారు. ఈ మేరకు టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్ అధికారిక నియామక ఉత్తర్వులను జారీ చేశారు. వైద్య రంగంలో ఆమెకు ఉన్న అనుభవం, సేవా దృక్పథం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్రను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.
నియామక పత్రాన్ని అందజేసిన సందర్భంగా డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజలకు మరింత చేరువ కావాలని, ముఖ్యంగా ప్రజారోగ్య సమస్యల పరిష్కారానికి వైద్యుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణ, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.
అలాగే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో డాక్టర్స్ సెల్ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ఆరోగ్య రంగ అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా డెంటల్ డాక్టర్లను సమన్వయం చేస్తూ ప్రజా ఆరోగ్య సేవలను మరింత విస్తృత స్థాయిలో అందించే దిశగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. వైద్యుల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తానని వెల్లడించారు. డాక్టర్ ప్రియాంకకు రాష్ట్ర స్థాయి కీలక బాధ్యతలు లభించడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆమె నాయకత్వంలో డాక్టర్స్ సెల్ మరింత చురుకుగా పనిచేసి పార్టీకి, ప్రజలకు విశేష సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీఐఎస్ఎఫ్ ఎన్ఎఫ్‌సీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' 75వ ఎడిషన్ విజయవంతం



హైదరాబాద్, మే 24 వెలుతురు:

దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమం 75వ ఎడిషన్‌ను సీఐఎస్ఎఫ్ యూనిట్-ఎన్ఎఫ్‌సీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, యువత మరియు ఫిట్‌నెస్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కమాండెంట్ శ్రీ శంకర రావు బైరెడ్డి మరియు అసిస్టెంట్ కమాండెంట్ హరేంద్ర సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించి పాల్గొన్న వారిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సైక్లింగ్ వంటి సులభమైన శారీరక వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.
"ఫిట్ ఇండియా" ఉద్యమం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రతి భారతీయుడి జీవన విధానంలో భాగం కావాలని వారు పేర్కొన్నారు. యువత ఆరోగ్యవంతంగా ఉంటేనే దేశం శక్తివంతంగా ముందుకు సాగుతుందని, అందుకోసం క్రీడలు, వ్యాయామం మరియు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అధికారులు పర్యావరణ పరిరక్షణ అంశాన్ని కూడా ప్రస్తావించారు. వాహనాల వినియోగాన్ని తగ్గించి సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఇంధన పొదుపుకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు. ఆరోగ్య సంరక్షణతో పాటు ప్రకృతి పరిరక్షణకు సైక్లింగ్ ఒక ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా సైక్లింగ్ నిర్వహించి ఫిట్‌నెస్‌పై తమ నిబద్ధతను చాటుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ, ఐక్యత మరియు సేవాభావాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం కొనసాగింది.
దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఫిట్ ఇండియా మూవ్‌మెంట్" లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై మరింత అవగాహన పెంపొందించడంతో పాటు, "ఆరోగ్యవంతమైన భారతం - శక్తివంతమైన భారతం" నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు. సైక్లింగ్ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే పర్యావరణాన్ని సంరక్షించవచ్చనే సందేశాన్ని సమాజానికి అందించిన ఈ కార్యక్రమం పాల్గొన్న వారందరిలో స్ఫూర్తిని నింపింది. అధికారులు ఇటువంటి ఫిట్‌నెస్ కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను తిప్పికొడతాం

- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి:సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్





కుత్బుల్లాపూర్(వెలుతురు ప్రతినిధి)మే 24:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పారిశ్రామిక ప్రాంత లోడింగ్ అన్లోడింగ్ హమాలీ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం షాపూర్ నగర్ సిఐటియు కార్యాలయంలో కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది.
ఈసమావేశానికి అతిథులుగా హాజరైన జే చంద్రశేఖర్, ఎండి. యూసుఫ్ లు మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ NDA ప్రభుత్వం కార్మికుల హక్కులను పెట్టుబడిదారుల కాళ్ల దగ్గర పెట్టిందని పెట్టుబడిదారుల ప్రయోజనలు తప్ప కార్మికుల ప్రయోజనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కొడ్స్ గా మార్చిందన్నారు. లేబర్ కొడ్స్ ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని కేద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కొడ్స్ కార్మికుల పాలిట ఉరి తాళ్లుగా మారయని దుయ్యబట్టారు. కార్మికులపై పని భారం పెంచే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ఒకపక్క కార్మికుల హక్కుల కోసం పోరాడుతుంటే ప్రభుత్వాలు మాత్రం ఉక్కుపాదంతో అణిచివేస్తున్నాయని వివరించారు. బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదమని ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రాష్ట్రంలో ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాలు పెంచుతు
జీఓ ప్రకటించిందని, కనీస వేతనాల పెంపులో శాస్త్రీయత లేదన్నారు. కనీస వేతనాలు పెంచడమంటే ఉన్న వేతనాలను తగ్గించడమేనా కనీస వేతనం లెక్కించాలంటే కార్మికుల కుటుంబ కనీస అవసరాలు పరిగణలోకి తీసుకోవాలనే ఆలోచన ప్రభుత్వం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.
ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలు స్వల్పంగా పెరిగి తగ్గాయని ప్రభుత్వం చెపుతున్నట్లు గణనీయంగా పెరగలేదని అన్నారు. కార్మిక సంఘాల, కనీస వేతనాల సలహా మండలి సిఫారసులను పరిగణలోకి ఎందుకు తీసుకోలేదని సుప్రీం కోర్ట్ తీర్పులకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కనీస వేతనం 26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి, నూతన లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా పోరాడాలని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు అండగా ఉండాలని సామాజిక భద్రత కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు దేవదానం, శ్రీనివాస్, మల్లారెడ్డి, భాషా, ఏఐటియుసి నాయకులు స్వామి, నర్సింహులు, మహేషు, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లిలో గ్రామంలో వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవ వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే





- వేణుగోపాలస్వామి కి ప్రత్యేక పూజలుచేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు 24:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం బ్రాహ్మణపల్లిలో గ్రామంలో ఆదివా రంజరిగిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గా రు పాల్గొన్నారు వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరిం చారు అనంతరం ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యే వేణుగోపాలస్వామి.కి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు అనంతరం భక్తులతో కలిసి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు నియోజకవర్గ ప్రజలు సు ఖశాంతులతో సుభిక్షంగా వర్ధిల్లాలని వేణుగోపాలస్వామిని మొక్కుకున్న ఎమ్మెల్యే సందర్భంగా మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టపీటవేస్తోందని ఇందులో భాగం గానే ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు ఈ కా ర్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఆలయకమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్. 294 మందిపై కేసులు



సైబరాబాద్ వెలుతురు మే 24:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు.
ఈ డ్రైవ్‌లో భాగంగా 294 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.255 ద్విచక్ర వాహనదారులు,05 ఆటోలు,34 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.
బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —244 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 30 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,20 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.
వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.
మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.
గత వారం (18.05.2026-23.05.2026) లో మొత్తం156 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 10 మందికి జరిమానా, జైలు శిక్ష,01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,145 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# ఆరోగ్య భద్రత... ఆరోగ్య భరోసానిచ్చేది సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ.





కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 24:

అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను ఆదివారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా సూరారం డివిజన్ కు చెందిన కె.ఎస్.ఎస్ ప్రఫుల్లా కుమారి కేరాఫ్ కె. జయప్రకాశ్ రావు రూ.50,000/(యాభై వేల రూపాయలు) మంజూరు కాగా...సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధికి చెందిన చిక్క శ్వేత తండ్రి చిక్క శ్రీనివాసులుకు రూ.1,50,000/ (ఒక లక్షా యాభై వేల రూపాయలు) మంజూరు కాగా...ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండి. సిద్దిక్ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మణ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి






- **రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 24:

రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్డూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఇతర మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 8 వేల 749 కోట్ల రూపాయల కనీసం మద్దతు ధరను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల చివరికల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము,జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా టాబ్ లో నమోదు చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు వార్తలను ఖండించాలని, ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించాలని, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన విషయాలను ప్రచారం చేయాలని తెలిపారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపు విషయంలో నెలల తరబడి వేచి ఉండవలసి వచ్చేదని, ఇప్పుడు వెంటనే చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు.

అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బ తినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కార్యక్రమాలను అధికారులందరూ సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, సిపిఓ సౌమ్య, పిడి మెప్మా వెంకట నారాయణ, డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల టెక్నికల్ సెమినార్..




- **విద్యుత్ భద్రతే ప్రధాన అజెండా**
- **సికింద్రాబాద్‌లో కిర్లోస్కర్–అసోసియేషన్ సంయుక్త సెమినార్**
- **ఏ గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం**
- **విద్యుత్ ప్రమాదాల నివారణపై విస్తృత చర్చ**
- **నాణ్యమైన పరికరాల వినియోగంపై అసోసియేషన్ తీర్మానం**
- **షార్ట్ సర్క్యూట్‌లే ప్రమాదాలకు ప్రధాన కారణమని అభిప్రాయం**
- **సరైన ఎర్తింగ్ వ్యవస్థతో ప్రమాదాలు తగ్గుతాయని సూచన**
- **జనరేటర్ నిర్వహణపై నిపుణుల కీలక సూచనలు**
- **ఓవర్‌లోడ్ వద్దని, లోడ్ నిర్వహణపై అవగాహన**
- **రెగ్యులర్ సర్వీసింగ్‌తో జనరేటర్ దీర్ఘాయుష్షు పెరుగుతుందని వెల్లడి**
- **ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లకు టెక్నికల్ సెమినార్.. భద్రతే ప్రధాన అంశంగా చర్చలు**
- **సికింద్రాబాద్‌లో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్–కిర్లోస్కర్ సంయుక్త కార్యక్రమం**

హైదరాబాద్ వెలుతురు మే 24:

తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్, కిర్లోస్కర్ జనరేటర్ల సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఒక ప్రముఖ హోటల్‌లో ఏ గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లకు టెక్నికల్ సెమినార్ నిర్వహించారు. విద్యుత్ భద్రత, నాణ్యమైన పరికరాల వినియోగం, ప్రమాదాల నివారణ అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి.

***విద్యుత్ ప్రమాదాల నివారణపై తీర్మానం***

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన పరికరాలను వినియోగించాలని తెలంగాణ కాంట్రాక్టర్ అసోసియేషన్ తీర్మానం చేసింది. ఎక్కువగా ప్రమాదాలు షార్ట్ సర్క్యూట్ వల్లే జరుగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వక్తలు పేర్కొన్నారు.

***ఎర్తింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి***

సరైన ఎర్తింగ్ వ్యవస్థ ఉన్నప్పుడు విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం ఉండదని తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి తెలిపారు. ఎర్తింగ్ సిస్టమ్ భద్రతలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు.

***జనరేటర్ నిర్వహణపై నిపుణుల సూచనలు***

కిర్లోస్కర్ ప్రతినిధులు జనరేటర్ల వినియోగం, నిర్వహణపై పలు సూచనలు చేశారు. జనరేటర్ ప్రారంభించే ముందు డీజిల్, ఇంజిన్ ఆయిల్, కూలెంట్ స్థాయిలను తనిఖీ చేయాలని సూచించారు. ఇంధన లీకేజీలు ఉన్నాయా లేదో పరిశీలించాలని తెలిపారు. ఎయిర్ ఫిల్టర్ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

జనరేటర్ సామర్థ్యానికి మించి లోడ్ వేయకూడదని, పరికరాలను క్రమంగా ఆన్ చేయాలని నిపుణులు సూచించారు. ప్రతి 250-300 రన్నింగ్ గంటలకు సర్వీసింగ్ చేయడం అవసరమని పేర్కొన్నారు. బ్యాటరీ టెర్మినల్స్ శుభ్రంగా ఉంచాలని, అవసరమైతే ఛార్జింగ్ చేయాలని తెలిపారు.

జనరేటర్‌ను గాలి బాగా ఆడే ప్రదేశంలో ఉంచాలని, సరైన ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలని, ఆన్‌లో ఉన్నప్పుడు ఇంధనం నింపకూడదని భద్రతా సూచనలు చేశారు.

కిర్లోస్కర్ సంస్థ 'కోయెల్ కేర్ KOEL Care' ద్వారా వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని వినియోగించడం ద్వారా నిపుణుల సేవలతో జనరేటర్లను సురక్షితంగా ఉంచుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.సి. రెడ్డి, నక్క యాదగిరి, శివకుమార్, సదానంద్, మహేందర్, నామిని వెంకటేష్, సుజయ్ కుమార్, రవీందర్ రెడ్డి, నేమోల బెనర్జీ, ఉదయ భాస్కర్, పొదుల గోవర్ధన్, కిర్లోస్కర్ కంపెనీ ప్రతినిధులు చంద్రశేఖర్, కిషోర్, డీలర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యార్థుల ఫీజుల బకాయిల విషయం చర్చించరా ??

- **మీరు ముఖ్యమంత్రి అయిన దగ్గర నుండి వేల కోట్ల రూపాయల భూములు అమ్ముతున్నారు కానీ అవి విద్యార్థుల సంక్షేమానికి ఖర్చు పెట్టరా ??**
- **జాజుల లింగం గౌడ్ రాష్ట్ర కన్వీనర్ బిసి జేఏసీ**



హైదరాబాద్ వెలుతురు మే 24:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి వేల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములు అమ్ముతున్నాడు కానీ బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువు కోసం పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో కోర్సు పూర్తయిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయని ఫీజులు మొత్తం చెల్లిస్తేనే ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని చెబుతున్నాయన్నారు ప్రభుత్వం మాత్రం ఫీజు బకాయిలు ఇవ్వకుండా వేలకోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు మాత్రం ఇస్తున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నది ప్రజల కోసమా కాంట్రాక్టర్ల కోసమా అని ఈ సందర్భంగా లింగం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ప్రశ్నించారు

## ఘనంగా మహేశ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు




- **హిమాయత్ నగర్‌లో కేక్ కట్ చేసిన మహాలక్ష్మి రామన్ గౌడ్**
- **ఎమ్మెల్యే క్వార్టర్స్ గుడారిలో కాంగ్రెస్ నేతల సంబరాలు**

హైదరాబాద్ వెలుతురు మే 24:

ఆదివారం రోజున తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ హిమాయత్ నగర్ డివిజన్‌లో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్ గుడారిలో మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి రామన్ గౌడ్, శివ, తాజ్ ఖాన్, సౌద్, మన్సూర్, పురుషోత్తం, బాలకిషన్, జైస్వాల్, జోసఫ్, రమేష్, అభిషేక్, మోషిన్, కొండయ్య, జగదీష్, అనీష్, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కష్టజీవుల చెమటచుక్కల నుంచే పుట్టిందే ఎర్రజెండా

- **మాజీ ఎంపిటిసి కుమ్మరి శంకర్**

నార్కట్ పల్లి వెలుతురు మే 24




మేడే పురస్కరించుకుని నార్కట్‌పల్లి మండలం శేరుబావిగూడెంలో ఆదివారం సిపిఐ(ఎం) పార్టీ శాఖ కార్యదర్శి అలుగుబెల్లి లింగారెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మాజీ ఎంపిటిసి కుమ్మరి శంకర్ మాట్లాడుతూ.. ఎంతోమంది కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్నదే మేడే అని అన్నారు. ఒకప్పుడు 12 గంటల పని దినాన్ని 8 గంటలకు కుదించాలని కార్మికులు చేసిన పోరాటంలో అమరులైన వారి నెత్తుటి చుక్కల నుంచే ఎర్రజెండా పుట్టిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ విధానాలను కార్మికులు, కర్షకులు అందరూ ఐక్యంగా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దండు రవి, బొల్లెద్దు సైదులు, కల్లూరి యాదమ్మ, పులిపెల్లి రాఘవరెడ్డి, చలపతి రెడ్డి, బత్తుల వెంకట్‌రెడ్డి, సింహం, శంకర్‌రావు, ఎల్లిదండ వెంకన్న, నంద్యాల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్నాటి అంజమ్మ జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో భోజనశాల ప్రారంభం

నార్కట్ పల్లి వెలుతురు మే 24



డాక్టర్ కర్నాటి లింగయ్య గారి ధర్మపత్ని కీర్తిశేషులు కర్నాటి అంజమ్మ గారి జ్ఞాపకార్థం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఉన్న శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్ర ట్రస్టు, ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో వృద్ధుల సౌకర్యార్థం 12 అడుగుల వెడల్పు, 26 అడుగుల పొడవు గల భోజనశాలను నిర్మించారు. వేదమూర్తులైన బ్రాహ్మణులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఆదివారం తేదీ 24052026 ఉదయం 10.30 గంటలకు దాతగా, కర్నాటి అంజమ్మ గారి భర్తగా డాక్టర్ కర్నాటి లింగయ్య భోజనశాల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించి వృద్ధులకు, బంధుమిత్రులకు భోజన విందు ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమ వృద్ధుల శ్రేయస్సు కోసం సేవాభావంతో ముందుకు వచ్చిన డాక్టర్ కర్నాటి లింగయ్యను ట్రస్టు సభ్యులు, స్థానికులు అభినందించారు.

# మానసిక వికలాంగులకి మెరుగైన సేవలు అందించాలి

- **సీనియర్ సివిల్ కోర్టు జడ్జీ జి. సబిత**

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 24



మండల లీగల్ సర్వీస్ అథారిటీ రామన్నపేట ఆధ్వర్యంలో వలిగొండ మండలంలోని టేకుల సోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని రామన్నపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ మానసిక వికలాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, వారికి అందిస్తున్న సేవలు, సంరక్షణ విధానాలపై ఆరా తీసి పరిశీలించారు. వారికి నాణ్యతతో కూడిన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అనంతరం ఆశ్రమంలోని రిజిస్టర్లు, సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్‌లు మీనాక్షి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే వలిగొండలోని శాంతి నిలయం ఆశ్రమాన్ని కూడా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

# రేపు 26న ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహం

- **మునుగోడులో ప్రభుత్వ పాఠశఆలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు**
- **కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **63 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతులు**
- **192 మందికి రూ.32.20 లక్షల ప్రోత్సాహకాలు**
- **పదో తరగతిలో మెరిసిన విద్యార్థులకు సత్కారం**

మునుగోడు వెలుతురు మే 24




కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 202526 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం మే 26న మునుగోడులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 63 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 192 మంది విద్యార్థులకు రూ.32.20 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.25 వేల, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.15 వేల, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.10 వేల చొప్పున బహుమతులు ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు మునుగోడులోని క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మాత్తుగా తనిఖీ చేసిన వేముల వీరేశం

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 24



మండలంలోని వెల్లంకి, సిరిపురం, రామన్నపేట పట్టణం, దుబ్బాక, మునిపంపుల, ఎన్నారం గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటవెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తెలిపారు.

# గంగాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సాధన కమిటీ ఏర్పాటు





గుండాల, మే 24 (వెలుతురు)

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సాధన కమిటీ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ కాళీ మంజుల ఆంజనేయులు, సలహాదారులుగా ఉపసర్పంచ్ చంద్రగిరి వెంకటయ్యను ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షులుగా అల్వాల జగతి, ఉపాధ్యక్షులుగా అల్వాల భూషణం, అల్వాల బిక్షపతిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి సురేష్‌దారస్వామి, కోశాధికారిగా కాళీ అనిల్, కార్యదర్శిగా అల్వాల రాజును నియమించారు. కార్యవర్గ సభ్యులుగా పింగళి విజయ్ భాస్కర్ రెడ్డి, పోచంపల్లి శ్రీకాంత్, అల్వాల అశోక్, అల్వాల ఐలేష్, సూరారం విక్రమ్, భూష శేఖర్, ఎండి యాకూబ్, దూదిగాని ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గంగాపురం గ్రామంలో డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ గ్రామ అభివృద్ధి, సామాజిక ఐక్యత కోసం కృషి చేయాలని పలువురు అభినందించారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, సి.ఎన్.జి ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి

- **పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచేలా ధరల పెంపు**
- **గుండు వెంకటనర్సు సిపిఎం మండల కార్యదర్శి**

మోత్కూర్, మే 24,వెలుతురు న్యూస్



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సిజిఎస్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే పశ్చిమాషియాలో తలెత్తిన యుద్ధం మూలంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి, పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెట్రోల్ పై లీటరుకు రూ 3.14 పైసలు, డీజిల్ పై లీటరుకు రూ 3.11 పైసలు, సిజిఎస్ గ్యాస్ పై లీటరుకు 2 రూపాయలు పెంచడమే కాక, ఎనమిది రోజుల వ్యవదిలోనే మూడు సార్లు సగటున లీటరకు 90 పైసల చొప్పున పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సమంజసం కాదని అన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోడీ ప్రభుత్వం ప్రజలపై పెట్రోల్, డీజిల్ భారం మోపిందని, గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని ప్రజలు మొత్తుకుంటుంటే పెంచబోమని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం, ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రజలపై బారాలు మోపడం దేశ ప్రజలను దగా చేయడమేనని విమర్శించారు. ఈ ధరలపెంపు రవాణా, వ్యవసాయ రంగాలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# బాజకుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన- ప్రభుత్వ విప్ వేముల వీరేశం

నార్కట్ పల్లి వెలుతురు మే 24




నార్కెట్‌పల్లి మండలం బాజకుంట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నార్కెట్‌పల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు అంశంపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించి, ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.

# చదువే జీవితాన్ని మార్చే మహాశక్తి: డాక్టర్ బండి సాయన్న గౌడ్

- **గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహణ**

జగిత్యాల జిల్లా వెలుతురు మే 24





జగిత్యాల జిల్లాలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందిస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువేనని పేర్కొన్నారు. నేటి సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోందని, పేదరికాన్ని జయించి కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చదువు మాత్రమే మార్గమని తెలిపారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలంటే విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, లక్ష్యసాధన, కష్టపడి చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ దశలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వంటివని, ఈ దశలో సాధించిన విజయాలు ఉన్నత స్థానాలకు తీసుకెళ్తాయని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయాల వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి కుటుంబ సహకారం, గురువుల మార్గదర్శనం అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుతం యువత సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లకు ఎక్కువ సమయం కేటాయిస్తూ చదువుపై దృష్టి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమాజ అభివృద్ధికి విద్యావంతులైన యువత అవసరమని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని, ఇలాంటి ప్రతిభా పురస్కారాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకుని నిరంతరం శ్రమిస్తే తప్పకుండా విజయాన్ని అందుకుంటారని, "కష్టం చేసిన వారికి విజయం ఖాయం" అనే నమ్మకంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చెక్కళ్ల మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ, పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభా పురస్కారాలు అందుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు మాత్రమేనని అన్నారు. ఇంకా ఉన్నత చదువులు అభ్యసించి అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా గౌడ్ సమాజానికి చెందిన అర్హులైన వారిని గోపాలో సభ్యులుగా చేర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్యాణ్ చక్రవర్తి గౌడ్ మాట్లాడుతూ, మారుమూల గ్రామాల నుంచి వచ్చి కష్టపడి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగాలని, చిన్న చిన్న సమస్యలకు భయపడి ఆత్మహత్యల వంటి తప్పుదారులు ఎంచుకోకూడదని సూచించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్ మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌ను కేవలం విద్యా అవసరాల కోసమే ఉపయోగించాలని సూచించారు. గూగుల్ వంటి వనరులను ఉపయోగించి ప్రతిరోజూ కొత్త పదాలు, వాక్యాలు నేర్చుకుంటే ఆంగ్ల భాషపై మంచి పట్టు సాధించవచ్చని తెలిపారు. జిల్లా ఆర్డీవో మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ఒక ఇంట్లో ఆడపిల్ల చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అడిషనల్ సబ్ కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు పలు సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లిదండ్రులు చదువుకునే పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపా నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు రీఅసెస్మెంట్‌తో మున్సిపాలిటీ ఆదాయం పెంచాలి





- **36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్...**

జహీరాబాద్ వెలుతురు మే 24

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మధ్య తరహా, భారీ పరిశ్రమలకు తక్షణమే రీఅసెస్మెంట్ నిర్వహించి ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆస్తి పన్ను విధించాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. పరిశ్రమలు విస్తరించినా, వ్యాపార కార్యకలాపాలు పెరిగినా ఇప్పటికీ పాత పన్ను విధానమే అమల్లో కొనసాగుతుండడం వల్ల మున్సిపాలిటీకి కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు పొందుతున్నప్పటికీ, పరిశ్రమల నుంచి వసూలు కావాల్సిన పన్నులు సరైన స్థాయిలో రాకపోవడం ఆందోళనకర విషయమన్నారు. పలు పరిశ్రమలు తమ విస్తీర్ణాన్ని, ఉత్పత్తి యూనిట్లను, గిడ్డంగులను, యంత్రాంగాన్ని పెంచుకున్నప్పటికీ పాత అసెస్మెంట్ ఆధారంగానే పన్నులు చెల్లిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం భారీగా తగ్గిపోతుందని, దీనివల్ల పట్టణ అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోందన్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరిశ్రమల ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. రికార్డులు, భవన విస్తీర్ణం, వ్యాపార విస్తరణ, యంత్రాల సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రీఅసెస్మెంట్ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పన్ను విధానం అమలు చేస్తే మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందని, ఆ నిధులతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వ్యవస్థ వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అదనంగా పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఈ ఆదాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలపై అదనపు భారం వేయకుండా ఆదాయ వనరులను పెంచాలంటే పరిశ్రమల రీఅసెస్మెంట్ అత్యవసరమని స్పష్టం చేశారు. జహీరాబాద్ అభివృద్ధి దృష్ట్యా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని పరిశ్రమల పన్ను వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## హంగీర్గా (కె) గ్రామంలో తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ జెండా కార్యక్రమం

- **ఖేడ్ ఇంచార్జ్ బాపు మల్ శెట్టి**

వెలుతురు నారాయణఖేడ్ మే 24





సంగారెడ్డి జిల్లా : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని హంగీర్గా (కె) గ్రామంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకులు, అధ్యక్షురాలు శ్రీమతి కవితమ్మ ఆదేశాల మేరకు మే 20 నుండి జూన్ 20 వరకు ప్రతి గ్రామంలో జెండా పండుగ కార్యక్రమాలను భారీ ఎత్తున చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు బాపుమల్ శెట్టి, శివశంకర్ పాటిల్ మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి కవితమ్మ ముఖ్యమంత్రి అయితే ప్రజలకు ఉచిత వైద్యం, ఉచిత విద్య అందించడంతో పాటు రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జెండా పండుగ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి కార్యకర్తలు నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, సంధాని, భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం, దిరాజ్, ప్రశాంత్, కిషన్ సింగ్, వైద్యనాథ్ బాశెట్టి, సోమనాథ్, రామన్న, బండెప్ప, విట్టల్, శంకర్, చెన్నప్ప, శివకుమార్, మొతిరం, హరి సింగ్, రమేష్, పండరి, గాలెప్ప, గణపతి, తుకారం, అడెప్ప, సుభాష్, గురప్ప, దావీదు, సుక్కప్ప, సాయిలు, స్వామిదాస్, రాజు, నర్సింలు, ఏసప్ప తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా ఏడువారాల జాతర



వెలుతురు నారాయణఖేడ్ మే 24

సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలంలోని ప్రసిద్ధి చెందిన బోరంచ నల్ల పోచమ్మ ఏడు వారాల జాతర వైభవంగా కొనసాగుతుంది. ఆదివారం నియోజకవర్గ వివిధ మండలాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మ వారికి ఒడిబియ్యం,నైవేద్యం,సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయంకు భక్తుల తాకిడి పెరగగా కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా ఎండోమెంట్ అధికారులు స్పందించి ఆలయ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

## జీనియస్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన





కరీంనగర్ వెలుతురు మే 24

కరీంనగర్ శ్రీ చైతన్య యూత్ క్లబ్ భగత్ నగర్ లో ఆదివారం నిర్వహించిన జీనియస్ ర్యాంకింగ్ చెస్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచినుంచి 125 మంది చదరంగం క్రీడాకారులు తమ మేధాశక్తిని నిరూపించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు( రూరల్) సిఐ ఆర్ కృష్ణ జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య పాల్గొని మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ పిల్లలకు చదరంగంతో మేధాశక్తితో పాటు ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య మాట్లాడుతూ పిల్లల ప్రతిభను వెలికి తీయడానికే ర్యాంకింగ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని ఈ టోర్నమెంట్ లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్ప్రైజర్ వారి సహకారంతో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్ప్రైజెస్ మేనేజర్ శ్రీనివాస్ ఎండి కుమారస్వామి ,, చైతన్య యూత్ క్లబ్ సభ్యులు పండుగ నాగరాజు,కరీంనగర్ జిల్లా డెమొక్రటిక్ డెవలప్మెంట్ కార్యదర్శులు కంకటి సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, రాకేష్, చీఫ్ ఆర్బిటర్ తరుణ్, అరుణ్, ఆర్బిటర్లు అభిరామ్, నితిన్, రేవిక్, స్వాతి, ప్రభుదేవా, వరుణ్, విశాల్ , అజయ్ క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ఏపీలో హై అలర్ట్

- విమానాశ్రయాలు, పోర్టుల్లో ప్రత్యేక నిఘా
- ఆఫ్రికా దేశాల ప్రయాణికులపై ప్రత్యేక స్క్రీనింగ్
- కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే వారిపై నిఘా
- విశాఖ, విజయవాడ, తిరుపతి ఎయిర్‌పోర్టుల్లో వైద్య పరీక్షలు
- ట్రావెల్ హిస్టరీ ఆధారంగా ప్రయాణికుల స్క్రీనింగ్
- అనుమానితులను వెంటనే క్వారంటైన్‌కు తరలింపు
- విశాఖ పోర్టులోనూ ప్రత్యేక పర్యవేక్షణ
- రోడ్డు మార్గాల ద్వారా వచ్చే వారిపైనా నిఘా
- ఎబోలా నియంత్రణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం
- ఐసోలేషన్ వార్డులు, 15 పడకల ప్రత్యేక
- సదుపాయాలు ఏర్పాటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని




**ఆరోగ్య శాఖ మంత్రి సూచన**

**ఆంధ్రప్రదేశ్ వెలుతురు మే 24:**
ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల ట్రావెల్ హిస్టరీ ఆధారంగా స్క్రీనింగ్ చేసి, అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వెంటనే క్వారంటైన్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. విశాఖ పోర్టులో కూడా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది. రోడ్డు మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వచ్చే ప్రయాణికులపైనా నిఘా పెంచినట్లు సమాచారం.
ఎబోలా నియంత్రణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్
ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ, కొవిడ్ సమయంలో పొందిన అనుభవాలతో ఎబోలా నియంత్రణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్న నగరాల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయగా, టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా 15 పడకల వార్డులు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అవసరమైన PPE కిట్లు, వైరస్ నిర్ధారణ పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు వర్చువల్ సమావేశాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఎబోలా లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా సమాచారం అందిస్తున్నట్లు చెప్పారు. ఆఫ్రికా దేశాలకు అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆఫ్రికా నుంచి వచ్చిన వారు ఆరోగ్య పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.

## ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే గారిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

**ఢిల్లీ వెలుతురు మే 24:**
ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే గారిని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఖర్గేతో మంత్రి శ్రీహరి చర్చించారు. అలాగే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న పలు జల కేటాయింపుల అంశాలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేరళలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఖర్గే గారికి మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రాజకీయ పరిస్థితులపై కూడా విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం.



# కర్ణాటకలో విషాదం ఆల్చిప్పల వేటకు వెళ్లి నదిలో చిక్కుకున్న కుటుంబం

- ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతు
- ఇప్పటివరకు 8 మృతదేహాల వెలికితీత
- మృతుల్లో ఏడుగురు మహిళలు
- ముగ్గురిని కాపాడిన స్థానిక జాలర్లు
- భారీ వర్షా లతో పెరిగిన నది ప్రవాహం
- ఆల్చిప్పల కోసం నదిలోకి దిగిన కుటుంబ సభ్యులు
- రక్షించబోయే క్రమంలో వరుసగా ప్రమాదం
- తత్తెహక్కలు నదిలో ఉద్రిక్త పరిస్థితి
- మిగిలిన వారి కోసం కొనసాగుతున్న గాలింపు
- ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు



**కర్ణాటక రాష్ట్రం వెలుతురు మే 24:**
కర్ణాటక రాష్ట్రంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆల్చిప్పల వేట కోసం నదిలోకి దిగిన ఒకే కుటుంబానికి చెందిన పలువురు వరద ప్రవాహంలో చిక్కుకుని గల్లంతైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఉత్తర కన్నడ జిల్లాలోని భత్కళ తాలూకా పరిధిలో ఉన్న తత్తెహక్కలు నదిలో జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎనిమిది మంది మృతదేహాలను అధికారులు వెలికితీశారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భత్కళ తాలూకాలోని సిరాలి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని 14 మంది సభ్యులు ఆదివారం ఉదయం ఆల్చిప్పల వేట కోసం తత్తెహక్కలు నది వద్దకు వెళ్లారు. శనివారం రాత్రి ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో నదిలో ఆల్చిప్పలు ఎక్కువగా లభిస్తాయని భావించి కుటుంబ సభ్యులంతా నదిలోకి దిగినట్లు సమాచారం. ఉదయం సుమారు 10 గంటల సమయంలో వారు వేట ప్రారంభించారు. అయితే కొద్దిసేపటికే ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు రావడంతో నది ప్రవాహం ఒక్కసారిగా ఉద్ధృతమైంది. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల్లో ముగ్గురు తొలుత ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారిని కాపాడేందుకు మిగిలిన వారు ప్రయత్నించగా పరిస్థితి అదుపు తప్పింది. ఒకరిని రక్షించేందుకు మరొకరు ప్రయత్నించే క్రమంలో దాదాపు అందరూ వరద ప్రవాహంలో చిక్కుకున్నారు. నది మధ్యలో తీవ్ర అలజడి నెలకొనడంతో వారంతా గల్లంతయ్యారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమీప ప్రాంతాల్లో ఉన్న జాలర్లు అప్రమత్తమై వెంటనే పడవలతో నదిలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఎంతో కష్టపడి ముగ్గురు వ్యక్తులను సురక్షితంగా బయటకు తీశారు. అయితే అప్పటికే మిగిలిన వారు ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. జాలర్ల సహాయంతో నదిలో గాలింపు చేపట్టగా ఇప్పటివరకు ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మిగిలిన ముగ్గురు కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది. నది పరిసర ప్రాంతాల్లో వరద నీటి ఉద్ధృతి అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో గల్లంతైన వారి ఆచూకీ గుర్తించడం కష్టంగా మారిందన్నారు. డ్రోన్ల సహాయంతో కూడా నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఘటనపై స్పందించిన స్థానిక అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా వరద పరిస్థితులు ఉన్నప్పుడు చేపల వేట, ఆల్చిప్పల సేకరణ వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాతావరణ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయడం ప్రాణాంతకమవుతుందని పేర్కొన్నారు. ఈ ఘటనతో సిరాలి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన పలువురు మృతి చెందడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.
కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. వర్షాల కారణంగా నది ప్రవాహం అకస్మాత్తుగా పెరిగిందా? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా? అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కర్ణాటక తీర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పలు ప్రాంతాల్లో నదులు పొంగిపొర్లుతుండగా, లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వాతావరణ శాఖ ఇప్పటికే పలు జిల్లాలకు భారీ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

# నటి ట్విషా శర్మ మృతి కేసులో మలుపు




- రెండోసారి పోస్టుమార్టం, ఎయిమ్స్ బృందం కీలక నివేదిక
- నోయిడా నుంచి భోపాల్‌కు చేరిన వివాహ జీవితం
- ఐదు నెలలకే అనుమానాస్పద మృతి కలకలం
- వరకట్న వేధింపుల ఆరోపణలతో కుటుంబ ఆగ్రహం
- రెండో పోస్టుమార్టం కోసం హైకోర్టు ఆదేశాలు
- దిల్లీ ఎయిమ్స్ నిపుణుల బృందం రంగంలోకి
- ఫోరెన్సిక్ రిపోర్టుపై కుటుంబానికి అనుమానాలు
- భర్త, అత్తపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు
- పరారీలో ఉన్న భర్త అరెస్టుతో కేసులో మలుపు
- సుప్రీంకోర్టు సుమోటోగా కేసు విచారణకు స్వీకరణ
- తుది నివేదికతో కేసు భవిష్యత్ దిశపై ఉత్కంఠ

**భోపాల్ వెలుతురు మే 24:**
భోపాల్‌లోని అత్తవారింట్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన నటి ట్విషా శర్మ కేసు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వివాహమైన కొద్ది నెలలకే జరిగిన ఈ ఘటనపై తీవ్రమైన ఆరోపణలు, ఫోరెన్సిక్ అనుమానాలు, న్యాయపోరాటాల నేపథ్యంలో మృతదేహానికి రెండోసారి పోస్టుమార్టం నిర్వహించడం కేసులో కీలక మలుపుగా మారింది. దిల్లీ ఎయిమ్స్ నిపుణుల బృందం న్యాయస్థానం ఆదేశాల మేరకు శవపంచనామా నిర్వహించి నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం.

**నోయిడా నుంచి భోపాల్‌కు చేరిన జీవితం... అనుమానాస్పద ముగింపు**
నోయిడాకు చెందిన ట్విషా శర్మ మే 12న భోపాల్‌లోని తన అత్తవారింట్లో ఉరివేసుకొని మృతి చెందినట్లు బయటపడింది. కేవలం ఐదు నెలల క్రితమే వివాహమైన ఆమె మరణం కుటుంబంలోనే కాకుండా సినీ, సోషల్ వర్గాల్లో కూడా అనేక అనుమానాలకు దారితీసింది. ప్రారంభ దర్యాప్తులో ఇది ఆత్మహత్యగా నమోదైనా, ఘటన వెనుక ఉన్న పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయని కుటుంబ సభ్యులు బలంగా వాదిస్తున్నారు.

**వరకట్న వేధింపుల ఆరోపణలతో కేసు మలుపు**
ట్విషా తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేస్తూ, తమ కుమార్తెను వరకట్నం కోసం భర్త సమర్థ్ సింగ్, అత్త గిరిబాలా సింగ్ వేధించారని పేర్కొన్నారు. గిరిబాలా సింగ్ విశ్రాంత న్యాయమూర్తి కావడం కేసుకు మరింత ప్రాధాన్యతను తీసుకువచ్చింది. మానసికంగా, శారీరకంగా వేధింపులు జరిగాయని, వాటి ఫలితంగానే ట్విషా ఆత్మహత్యకు పాల్పడిందని వారు ఆరోపిస్తున్నారు.

**మృతదేహంపై అనుమానాలు... రెండో పోస్టు-మార్టం డిమాండ్**
మొదటి పోస్టుమార్టం నివేదికపై కుటుంబ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నివేదికలోని కొన్ని అంశాలు స్పష్టత లేకుండా ఉన్నాయని, ఫోరెన్సిక్ విశ్లేషణలో లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ వారు రెండోసారి పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. తమ కుమార్తె మరణాన్ని సాధారణ ఆత్మహత్య కేసుగా పరిగణించవద్దని, సమగ్ర దర్యాప్తు జరగాలని కోరుతూ మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు.

**హైకోర్టు ఆదేశాలతో ఎయిమ్స్ బృందం రంగంలోకి**
కుటుంబ పిటిషన్‌ను పరిశీలించిన మధ్యప్రదేశ్ హైకోర్టు, కేసులోని సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకొని దిల్లీ ఎయిమ్స్ నిపుణుల బృందం ద్వారా రెండోసారి పోస్టుమార్టం నిర్వహించాలని ఆదేశించింది. నలుగురు నిపుణుల బృందం భోపాల్‌కు చేరుకుని ప్రత్యేక పర్యవేక్షణలో శవ పంచనామా నిర్వహించింది. ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**కీలక ఫోరెన్సిక్ పరిశీలనపై దృష్టి**
ఎయిమ్స్ బృందం చేసిన రెండో పోస్టుమార్టం ప్రధానంగా గాయాల స్వభావం, మరణ సమయం, శరీరంపై ఉన్న ఇతర గుర్తులపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మొదటి నివేదికలోని సందేహాస్పద అంశాలను పునఃపరిశీలించిన ఈ బృందం సమగ్ర ఫోరెన్సిక్ విశ్లేషణకు ప్రాధాన్యం ఇచ్చింది. నివేదికను న్యాయస్థానానికి సమర్పించనున్నారు.

**భర్త, అత్తపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు**
ట్విషా శర్మ మృతి కేసులో ఆమె భర్త సమర్థ్ సింగ్, అత్త గిరిబాలా సింగ్‌పై పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వరకట్న వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదు అయిన వెంటనే విచారణ ప్రారంభమైనప్పటికీ, ప్రధాన నిందితుడైన భర్త పరారీలోకి వెళ్లడంతో దర్యాప్తు మరింత క్లిష్టంగా మారింది.

10 రోజుల పరారీ తర్వాత భర్త అరెస్టు
మరణ ఘటన తర్వాత దాదాపు 10 రోజుల పాటు పరారీలో ఉన్న సమర్థ్ సింగ్‌ను మే 22న పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచగా, స్థానిక న్యాయస్థానం ఏడు రోజుల పోలీస్ కస్టడీకి ఆదేశించింది. అతడిని విచారించి కేసులోని నిజాలను వెలికితీయాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

**సుప్రీంకోర్టు స్వయంగా కేసు విచారణకు సుమోటో**
ఈ కేసు ప్రాధాన్యతను గుర్తించిన సుప్రీంకోర్టు స్వయంగా (సుమోటోగా) విచారణకు తీసుకుంది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనలో న్యాయపరమైన పారదర్శకత అవసరమని భావించిన సుప్రీంకోర్టు సోమవారం దీనిపై విచారణ చేపట్టే అవకాశం ఉంది. దీనితో **కేసు జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.**
కుటుంబ సభ్యుల న్యాయపోరాటం కొనసాగింపు
ట్విషా తల్లిదండ్రులు తమ కుమార్తెకు న్యాయం జరగాలని పట్టుదలగా ఉన్నారు. ఇది కేవలం ఆత్మహత్య కేసు కాదని, వ్యవస్థాపిత వేధింపుల ఫలితమని వారు వాదిస్తున్నారు. పూర్తి ఫోరెన్సిక్ నివేదిక, నిష్పక్షపాత దర్యాప్తు లేకుండా కేసును ముగించవద్దని వారు డిమాండ్ చేస్తున్నారు.

**కేసులో తదుపరి దశపై ఉత్కంఠ**
ఎయిమ్స్ బృందం సమర్పించనున్న రెండో పోస్టుమార్టం నివేదిక ఇప్పుడు కేసులో కీలకంగా మారనుంది. ఈ నివేదిక ఆధారంగా దర్యాప్తు కొత్త దిశలో సాగవచ్చని న్యాయనిపుణులు భావిస్తున్నారు. సుప్రీంకోర్టు విచారణ, పోలీసుల కస్టడీ విచారణలతో ఈ కేసు మరింత మలుపులు తిరిగే అవకాశం ఉంది.

# కేసముద్రం మున్సిపాలిటీ ప్రజలకు అత్యవసర విజ్ఞప్తి

- SGF అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్

**కేసముద్రం వెలుతురు మే 24:**
ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతూ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. ముఖ్యంగా వడగాలుల ప్రభావంతో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఇటీవల మన పరిసర ప్రాంతాల్లోనే 11 మంది వడదెబ్బకు గురైన ఘటనలు చోటుచేసుకోవడం చాలా ఆందోళనకర విషయం. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేసముద్రం మున్సిపాలిటీ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మనవి చేస్తున్నాను. అత్యవసరం ఉంటే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దు. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు, టోపీ లేదా తల కప్పుకునే వస్త్రాలు తప్పనిసరిగా ఉపయోగించాలి. ప్రతి ఒక్కరూ తరచుగా మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ORS వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలి. ఎండలో ఎక్కువసేపు పని చేసే కార్మికులు, రైతులు, వ్యాపారులు తగిన విరామాలు తీసుకుంటూ చెట్ల నీడలో విశ్రాంతి తీసుకోవాలి.

**చిన్నపిల్లలను ఎండలో ఆడనివ్వకుండా జాగ్రత్త పడాలి**
వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా చూసుకోవాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రి లేదా వైద్యులను సంప్రదించాలి. శరీరంలో నీరసం, తలనొప్పి, జ్వరం, వాంతులు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి కుటుంబం సురక్షితంగా ఉండాలని ఆకాంక్షిస్తూ... ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను.
ప్రజల ఆరోగ్యం - మన బాధ్యత మన ఆరోగ్యం - మన భద్రత



SGF అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్

# మహిళా రిజర్వేషన్ అమలు, పెరిగిన ఇంధన ధరలపై పోరాటానికి మహిళా కాంగ్రెస్ సిద్ధం









- **రంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి మహిళా మహా సభలో తీర్మానం**
- **రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభరత్**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 24**: ఆదివారం రోజున ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ గారి ఆధ్వర్యంలో జరగనున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి కీలక తీర్మానాలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.
మహిళా మహా సభలో చర్చించి తీర్మానించవలసిన ముఖ్య అంశాలు:

**1. మహిళా రిజర్వేషన్ అమలు**:
ప్రస్తుతం ఉన్న 542 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం మహిళలకు యథావిధిగా కేటాయించి, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. మహిళలకు రాజకీయ భాగస్వామ్యం కల్పిస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

**2. SIR పేరిట ఓటర్ల తొలగింపు కుట్రపై హెచ్చరిక:**
ఇతర రాష్ట్రాల్లో SIR పేరిట తమకు అనుకూలంగా ఓటర్లను తొలగించే కుట్రను తెలంగాణలో కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తే మహిళా కాంగ్రెస్ తరపున ప్రజలను చైతన్యవంతం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం.

**3. పెరిగిన ఇంధన ధరలపై పోరాటం:**
దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజల జీవించే హక్కును కబళిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తొలగించే దిశగా వారికి అండగా నిలబడతామని హామీ ఇస్తున్నాం.

**4. మోడీ ప్రభుత్వ వైఫల్యంపై విమర్శ:**
దేశాన్ని నడపలేని మోడీ ప్రభుత్వం పొదుపు పేరిట ప్రజలను తీవ్ర దారిద్ర్యంలోకి నెట్టి చేతులు దులుపుకుంటోంది. ఇలాంటి చేతకాని ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఉద్యమాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ మరింత క్రియాశీలకంగా ముందుకు నడిపిస్తుందని స్పష్టం చేస్తున్నాం.

**5. స్వదేశీ ముద్దుపై మోడీ ద్వంద్వ వైఖరి:**
"విదేశీ వస్తువులు వద్దు, స్వదేశీ ముద్దు" అని నినదించే మోడీ తన రోజువారీ జీవితంలో వాడే కళ్ళద్దాలు, పెన్ను, బట్టలు, కార్లు, చివరికి తిండి వరకు విదేశీ వస్తువులేనని ప్రజలు గమనిస్తున్నారని ఆరోపించారు. రాబోయే కాలంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకత్వం ఆధ్వర్యంలో, రాష్ట్ర మరియు కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుంది. ఇప్పటి వరకు తనను వెన్నుతట్టి నడిపించిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వానికి, రాష్ట్ర పార్టీ నాయకులకు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారికి, ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జ్యోతి భీమ్ భరత్ పేర్కొన్నారు.

# వనరుల దోపిడి కోసమే యుద్ధాలు






- **శాంతి ద్వారానే అభివృద్ధికి సాధ్యం**

కర్నూల్ వెలుతురు మే 24

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో ఆయిల్ గ్యాస్ , ఖనిజ వనరులు కోసమే అమెరికా యుద్ధాలు చేస్తుందని ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్ రావు ఆరోపించారు. ఆదివారం నాడు ప్రజా వైద్యశాల కాన్ఫరెన్స్ హాల్ నందు యుద్ధాలు వద్దు శాంతి కావాలని జిల్లా సదస్సు భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో జరిగింది. సదస్సుకు బి సుంకన్న అధ్యక్షత వహించగా ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్ రావు మాట్లాడుతూ మొదటి ప్రపంచ యుద్ధం రెండో ప్రపంచ యుద్ధంలో కోట్లాదిమంది మరణించారని యుద్ధాల వల్ల ఎలాంటి లాభం లేదు శాంతి ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఉద్దేశంతో ఇస్కఫ్ సంఘం ఏర్పాటు అయిందని తెలిపారు. ఇస్కఫ్ అంతర్జాతీయ స్థాయిలో శాంతి కోసం కృషి చేస్తుందని, ఒక దేశ పై మరొక దేశం దాడి చేస్తే దానికి వ్యతిరేకంగా ప్రజల చైతన్య చేయడం లక్ష్యంగా శాంతి కోసం ఏళ్ళ తరబడి కృషి చేస్తుందని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదం ఇతర దేశాలపై పెత్తనం చేస్తూ ఆ దేశంలోని సహజ సంపద వనరులు అన్నిదోపిడీ చేసి అందులో భాగంగా ఏదో రూపంలో ఆ దేశలపై కుట్ర చేస్తూ యుద్ధాలు చేయడం ఆ దేశ ప్రజలను చంపుతున్నారునీ ఆరోపించారు. అమెరికా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దాదాపు పది దేశాలపై దాడులు యుద్ధాలు చేసిందని పెద్దన్న పాత్ర పోషించడం కోసమే తమ కాళ్ళ కింద అన్ని దేశాలు ఉండాలని దురుద్దేశంతో పనిచేస్తుందని దీనివల్ల ప్రాణ నష్టం తప్ప అభివృద్ధికి ఏమాత్రం దోహదపడదని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు మాట్లాడుతూ అమెరికా వెనిజులా క్యూబా ఇతర అరబ్ దేశాల్లో ఉన్న ఆయిల్ గ్యాస్ ఖనిజ సంపద దోచుకునేందుకు ఆ దేశాలపై దాడులు చేస్తుందని, అమెరికా సామ్రాజ్యవాదానికి అనేక కమ్యూనిస్టు దేశాలు పోరాడుతున్నాయని తెలిపారు. ఇజ్రాయిల్ అమెరికా సహాయం చేయడం ద్వారా పాలస్తీనా అనే దేశం ప్రపంచ పటంలో లేకుండా చేయడమే లక్ష్యంగా పసిపిల్లలు ,మహిళలను చూడకుండగా నరహంతక హత్యలు చేస్తున్నారని విమర్శించారు.
అమెరికా సామ్రాజ్యం అవలంబిస్తున్న పెట్టుబడి దారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.

**శాంతి ఉంటే యుద్ధాలు ఉండవు యుద్ధాలుంటే శాంతి ఉండదు**

ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం కోసం ,మత ఆధిపత్యాలు, వనరుల దోపిడీ లక్ష్యంగా యుద్ధాలు జరుగుతున్నాయని శాంతి ఉంటే యుద్ధాలు ఉండవని యుద్ధాలుంటే శాంతి ఉండదని రెండు కూడా విరుద్ధమైన పదాలుగా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్ననేపథ్యంలో శాంతి ద్వారానే అభివృద్ధికి మార్గం అని సీనియర్ లెక్చరర్ సి రమేష్ అన్నారు. ఇస్కఫ్ ప్రచార కార్యదర్శి జీవి శివకుమార్ మాట్లాడుతూ దేశంలో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి సమస్యలపై స్పందించే గుణం కోల్పోతున్నారని యువతను చైతన్య చేయాల్సిన బాధ్యత మేధావి వర్గంపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి వసంత కుమార్, సీనియర్ అడ్వకేట్ జి నాగ శేషయ్య, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ రాయలసీమ జోనల్ కార్యదర్శి నాగరాజు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు రత్నం ఏసేపు , ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ మునెప్ప, ఎన్ మనోర్ మాణిక్యం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు, నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబి రసూల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, బోయ రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న షాబీర్ భాష, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా నాయకులు నాగేంద్రయ్య డి శ్రీనివాసరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ నగర నాయకులు రామాంజనేయులు, రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం ఎస్టియు నాయకులు వీర చంద్ర, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్, అభి, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు




- **అగ్నిగుండంగా మారిన నేల**
- **వడదెబ్బకు ఒక్కరోజే 16 మంది బలి**
- **ఏమాత్రం తగ్గని ఎండల తీవ్రత**
- **మే నెల ముగుస్తున్నా సడలని ఎండల వేడి**
- **2015-2023 నాటి పరిస్థితులను గుర్తు చేస్తున్న ఎల్ నినో**
- **విజయవాడ బస్టాండ్‌లో ముగ్గురు ప్రయాణికులు బలి**
- **ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 12 మరణాలు**
- **అంతటా 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**
- **కృష్ణా జిల్లా కనుమోలులో 45.8, అనకాపల్లి జిల్లాలో 45.5 డిగ్రీలు**
- **95 మండలాల్లో నిప్పుల కొలిమి**

**హైదరాబాద్ వెలుతురు మే 24**: రోహిణీ కార్తె ప్రవేశిస్తున్న వేళ తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అంచనాలకు అందడం లేదు. మే నెల చివరి వారానికి చేరుకున్నా భానుడి భగభగలు ఏమాత్రం తగ్గడం లేదు. సూర్యుడి వేడి సెగలకు, ఉక్కపోతకు రాష్ట్రం మొత్తం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. గతంలో భారీగా ఎండలు నమోదైన 2015, 2023 సంవత్సరాల తరహాలోనే, ఈ ఏడాది కూడా పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్ నినో' ప్రభావం బలంగా ఉండటమే ఈ తీవ్రమైన ఉష్ణోగ్రతలకు ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పగటిపూట నిప్పులు కురిపిస్తున్నట్లుగా వీస్తున్న వేడిగాలుల వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే తప్ప జనం రోడ్లపైకి రావడం లేదు. అయినప్పటికీ, ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక చాలామంది వడదెబ్బ బారిన పడుతున్నారు. ఈ తీవ్రమైన ఎండల కారణంగా శనివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బ తగిలి 16 మంది మరణించడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఇందులో అత్యధికంగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల ఉమ్మడి పరిధిలోనే 12 మరణాలు సంభవించాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన జల్లా కొండలు (54), కేతనకొండ ప్రాంతానికి చెందిన పఠాన్ నాగుల్మీర (32), కొటికలపూడికి చెందిన మేకా నిర్మల (50), కంచికచెర్ల వాసి ఎండీ అబిదున్నీసా (26) ఎండ వేడిని తట్టుకోలేక కన్నుమూశారు. మేడికొండలూరు మండలం మంద్రూరుపురం గ్రామానికి చెందిన కడియాల బాలయ్య (94) వయసు పైబడటం, ఎండ తీవ్రత తోడవడంతో ప్రాణాలు కోల్పోయారు. అలాగే విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వద్ద బస్సుల కోసం వేచి చూస్తూ తీవ్రమైన వడదెబ్బకు గురై ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరణాల పరంపర ఇక్కడితో ఆగలేదు. విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఎండ దెబ్బకు రోడ్డుపైనే పడిపోయి మరణించాడు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరంలో భిక్షపతి (45) అనే వ్యక్తి, విజయవాడ ఓల్డ్ టౌన్ లోని రాజకుమారి థియేటర్ సమీపంలో వరంగల్‌కు చెందిన వి.నరసయ్య (50) వడదెబ్బ కారణంగా మృతి చెందారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామంలో పడవల బసవయ్య (86) ఎండ వేడికి ఒక్కసారిగా అస్వస్థతకు గురై తుదిశ్వాస విడిచారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో దొండేటి వెంకట్రావమ్మ (80), అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కెబిపి అగ్రహారానికి చెందిన వికలాంగుడు గాడిగొయ్యిల సత్యనారాయణ (28) కూడా వడగాడ్పుల కారణంగా బలయ్యారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం పెదవేగి గ్రామానికి చెందిన మారగాని శ్రీనివాసరావు (60), అదే మండలం కొప్పాకకు చెందిన చల్లారి రత్నాలరావు (55) పొలం పనులకు వెళ్లి ఎండ వేడిమికి తాళలేక మరణించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) క్యాంపస్ వాతావరణ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ఎండల తీవ్రత రాబోయే రోజుల్లో మరింత పెరిగేలా ఉంది. శనివారం నాడు కృష్ణా జిల్లాలోని కనుమోలులో రికార్డు స్థాయిలో గరిష్టంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే అనకాపల్లి జిల్లా మకవరపాలెంలో 45.5 డిగ్రీల వేడి రికార్డయిందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో విస్తరించి ఉన్న సుమారు 95 మండలాల్లో శనివారం 42 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆదివారం నాటి వాతావరణ పరిస్థితులపై విపత్తు నిర్వహణ సంస్థ మరికొన్ని హెచ్చరికలను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 21 మండలాల్లో అత్యంత తీవ్రమైన వడగాడ్పులు (సీవియర్ హీట్ వేవ్స్) వీచే ప్రమాదం ఉందని, మరో 214 మండలాలపై సాధారణ వడగాడ్పుల ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. ముఖ్యంగా ఆదివారం రోజున ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని కొన్ని మైదాన ప్రాంతాలలో ఎండలు ముదిరి ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల వరకు వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాల ప్రజలు మధ్యాహ్నం పూట ఇళ్లలోనే ఉండాలని, మంచినీళ్లు, ఓఆర్ఎస్ లేదా మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, ఒకవైపు ఎండలు మండిపోతున్నప్పటికీ.. మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి ఉత్తర ఆంధ్ర ప్రదేశ్ వరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావం ఇంకా కొనసాగుతోంది. ఈ వాతావరణ ద్రోణి కారణంగా రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు కాస్త ఉపశమనం లభించనుంది. దీని ప్రభావంతో నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఎండలు ఎక్కువగా ఉన్నందున చిన్న పిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది.

## స్క్రీన్ వ్యసనానికి 'గ్రీన్ థెరపీ' సరైన పరిష్కారం..

# నీల్సన్ నివేదికలో వెల్లడి..



మనం మనకు ఇష్టమైనవారితో కూర్చున్నప్పుడు కూడా తరచుగా స్మార్ట్ ఫోన్‌లలోనే మునిగిపోతున్నామా..? భోజనం చేస్తూ ఈమెయిల్స్ చూసుకోవడం, ఎదుటివారితో మాట్లాడుతుండగానే మెసేజ్‌లు టైప్ చేయడం నేడు సర్వసాధారణమైపోయింది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు చేతిలో మొబైల్ లేనిదే క్షణం గడవడం లేదు. తాజా నివేదికల ప్రకారం, సగటున ఒక వ్యక్తి రోజుకు 8 గంటలకు పైగా స్క్రీన్‌లతోనే గడుపుతున్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇది మనం నిద్రపోయే లేదా పనిచేసే మొత్తం సమయం కంటే ఎక్కువగా ఉండడం గమనించాల్సిన అంశం.

ఇంటర్నెట్‌ను మొదట పరిచయం చేసినప్పుడు, దాని సృష్టికర్తలు ఈ సాంకేతికత మన జీవితాలను మరింత మెరుగుపరుస్తుందని భావించారు. అప్పట్లో, ప్రజలు ఆన్‌లైన్‌లో వారానికి ఒక గంట కూడా గడిపేవారు కాదు, కానీ ప్రస్తుత నీల్సన్ నివేదికలో వెల్లడైంది. ఈ రోజు, ప్రజలు రోజుకు 8 గంటలకు పైగా స్క్రీన్‌లను చూస్తూ గడుపుతున్నారు. ఇది మనం నిద్రపోయే లేదా పనిచేసే మొత్తం సమయం కంటే ఎక్కువ. చరిత్రలో అందమైన ప్రకృతి దృశ్యాల కంటే మన చేతుల్లోని చిన్న గాజు తెరకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్న మొదటి తరం బహుశా మనమే కావచ్చు.

### నిరంతరం సగం శ్రద్ధే..

డిజిటల్ వ్యసనం వల్ల ప్రజల్లో "నిరంతరం సగం శ్రద్ధతో ఉండటం" అనే మానసిక స్థితి పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంటే, మనం డిజిటల్ ప్రపంచానికి కనెక్ట్ అయి ఉంటూ, నిజ జీవితంలో ఎప్పుడూ పూర్తిగా లీనమవలేక పోతున్నాం. మెదడు ఎప్పుడూ తదుపరి నోటిఫికేషన్ కోసం అప్రమత్తంగా ఉండటం వల్ల దానికి విశ్రాంతి లభించట్లేదు. దీనివల్ల పెద్దల్లో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, ఒంటరితనం పెరుగుతుండగా.. చిన్నతనంలో ఎక్కువ సమయం స్క్రీన్లకు పరిమితమయ్యే పిల్లల్లో కౌమారదశకు వచ్చేసరికి డిప్రెషన్ లక్షణాలు కనిపిస్తున్నట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

### ప్రకృతి ఒడిలో 20 నిమిషాలు..!

ఈ తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యకు ప్రకృతి సిద్ధమైన చికిత్స అందుబాటులో ఉంది. దీనికోసం ఎలాంటి ఖరీదైన థెరపీలు అవసరం లేదు. కేవలం రోజుకు 10 నుంచి 20 నిమిషాల పాటు ప్రకృతిలో గడపడం వల్ల మానసిక స్థితి గణనీయంగా మెరుగుపడుతుందని అంతర్జాతీయ అధ్యయనాలు నిరూపిస్తున్నాయి.

ఇంటి నుంచి బయటకు వచ్చి కాసేపు పచ్చదనంలో గడపడం వల్ల ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. హృదయ స్పందన రేటు నియంత్రణలోకి వస్తుంది. ప్రకృతిలో చిన్న నడక వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దాదాపు 20శాతం వరకు పెరుగుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది ఏ రకమైన ప్రొడక్టివిటీ యాప్ కూడా అందించలేని అద్భుతం.

### వారానికి 2 గంటలు చాలు..



వారానికి కనీసం రెండు గంటల సమయాన్ని ప్రకృతి కోసం కేటాయించే వారిలో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనికోసం దట్టమైన అడవులు లేదా పర్వత ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేదు. మనకు అందుబాటులో ఉండే పార్కులు, పచ్చని చెట్లు ఉండే వీధులు కూడా అంతే చక్కటి ఫలితాన్ని ఇస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

నేడు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యాప్‌ల కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టే సాంకేతిక ప్రపంచంలో.. ఉచితంగా లభించే ఈ 'గ్రీన్ థెరపీ'ని మనం విస్మరిస్తున్నాం. కాబట్టి, సాకులు పక్కన పెట్టి, కాసేపు మొబైల్ స్క్రీన్‌లను ఆపివేసి, స్వచ్ఛమైన గాలిలో ప్రకృతితో కలిసి నడవడానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా హెల్తీగా ఉండొచ్చు.

# హోటల్ స్టైల్లో స్మోకీ తందూరి ప్రాన్స్



రొయ్యలతో చాలా వెరైటీలు తిని ఉంటారు. స్మోకీ తందూరి ప్రాన్స్ ఈ కొలతల ప్రకారం చేశారంటే రుచి అద్దిరిపోతుంది..

**కావలసినవి:**

రొయ్యలు అర కిలో,
పెరుగు అర కప్పు,
ఉప్పు రుచికి తగినంత,
అల్లం వెల్లుల్లి పేస్ట్ 2 టేబుల్ స్పూన్లు,
కశ్మీరి కారం 2 స్పూన్లు,
ధనియాలు,
జీలకర్ర పొడులు,
కారం,
కసూరీ మేథీ స్పూన్ చొప్పున,
ఛాట్ మసాలా,
గరం మసాలా,
మిరియాల పొడి అర స్పూన్ చొప్పున,
పసుపు పావు స్పూన్,
నిమ్మరసం 2 స్పూన్లు,
నూనె 2 టేబుల్ స్పూన్లు,
వెన్న టేబుల్ స్పూన్,
ఉల్లి స్లైసులు,
నిమ్మచెక్కలు,
కొత్తిమీర అలంకరించేందుకు

**స్మోక్ కోసం:**


బొగ్గు ముక్క 1,
నెయ్యి స్పూన్

**తయారీ:**



రొయ్యలను శుభ్రంచేసి పక్కనుంచాలి. వెడల్పాటి పాత్రలో పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, రెండు రకాల కారాలు, మిరియాలు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, ఛాట్ మసాలా, పసుపు, నిమ్మరసం, కసూరీ మేథీ, ఉప్పు వేసి.. బాగా కలపాలి.

ఈ మసాలాను రొయ్యలకు పట్టించి ఫ్రిజ్‌లో ఉంచాలి. ముప్పావుగంట తర్వాత బయటకు తీయాలి. పెనం మీద నూనె వేడిచేసి.. మధ్యస్థమైన సెగ మీద రెండు వైపులా కాల్చుకోవాలి. స్మోకీ ఫ్లేవర్ కోసం.. బొగ్గు ముక్కను స్టౌపై ఎర్రగా కాల్చాలి. వేయించిన రొయ్యల్లో.. చిన్న స్టీల్ కప్పు ఉంచి.. అందులో కాలిన బొగ్గు, దాని మీద నెయ్యి వేసి.. వెంటనే మూత పెట్టాలి. 5 నిమిషాలు అలా ఉంచితే.. అద్భుతమైన స్మోకీ ఫ్లేవర్ వస్తుంది. కొత్తిమీర, ఉల్లి స్లైసులు, నిమ్మచెక్కలతో గార్నిష్ చేస్తే హోటల్ స్టైల్లో యమ్మీగా ఉంటుంది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com